
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

గుంటూరు జిల్లా వార్తలు

ఆదివారం 12 జనవరి 2025



నరసరావుపేట మండలం పాలపాడు ప్రాంతంలో సాగు చేసిన పొగాకు

పొగాకు.. 314 శాతం

- రబీలో రికార్డు స్థాయిలో సాగు
- శనగ, మొక్కజొన్నకు ప్రత్యామ్నాయం..
- అనుమతులు పొందని కొందరు రైతులు

పొగాకు.. రబీలో రికార్డు స్థాయిలో సాగైంది. శనగ, మొక్కజొన్న పంటలకు ప్రత్యామ్నాయంగా రైతులు అత్యధికంగా సాగు చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అత్యధికంగా రైతులు పొగాకు సాగు వైపు మొగ్గారు. కొందరు రైతులైతే ఈసారి పొగాకు బోర్డు అనుమతి లేకుండానే సాగు చేశారు. అయినా ఈ సారి సాగు ఆశాజనకంగా ఉంది. దిగుబడులు కూడా బాగుంటాయని రైతులు ఆశిస్తున్నారు. విస్తృతంగా పొగాకు సాగు కావడంతో విక్రయాలకు పొగాకు బోర్డు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు వ్యవసాయ శాఖ సహకరించాలి. మొక్కజొన్న, శనగ సాగు సగానికి సగం తగ్గినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించిన నేపథ్యంలో పొగాకు సాగు గణనీయంగా పెరిగింది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రబీలో పంటల సాగులో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. మూడు జిల్లాల పరిధిలో రబీలో శనగ, మొక్కజొన్న పంటల సాగు గణనీయంగా తగ్గింది. ప్రత్యామ్నాయ పంటలపై అత్యధికంగా రైతులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో పొగాకు సాగు ఊహించని రీతిలో పెరిగింది. దీంతో రికార్డు స్థాయిలో పొగాకు సాగు చేశారు. సాగు విస్తీర్ణం 314 శాతంగా నమోదైంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 81,718 ఎకరాల్లో పొగాకు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. గత ఏడాది కన్నా సాగు రెట్టింపు చేశారు. వ్యవసాయ శాఖ అంచనా మేరకు పొగాకు సాధారణ విస్తీర్ణం 25,978 ఎకరాలు కాగా 81,718 ఎకరాల్లో సాగు చేశారు. పొగాకు దిగుబడులు రైతుల చేతికి వస్తున్నాయి. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. బోర్డు నుంచి ముందస్తు అనుమతులు పొంది పొగాకు సాగు చేయాలి. అయితే కొందరు రైతులు పొగాకు బోర్డు నుంచి అనుమతులు పొందకుండానే సాగు చేపట్టినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో బోర్డు నిర్ణయంపైనే పొగాకు విక్రయాలు ఆధారపడి ఉన్నాయి. సాగు చేపట్టిన అందరికీ పొగాకు విక్రయాలకు అనుమతులు మంజూరు చేయించేందుకు వ్యవసాయ శాఖ వెనువెంటనే చర్యలు చేపట్టకుంటే రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. తాము సాగు చేసిన పొగాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విక్రయించుకునేలా వ్యవసాయ శాఖ స్పందించాలని రైతులు కోరుతున్నారు.

సగం తగ్గిన శనగ, మొక్కజొన్న సాగు..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రబీలో మొక్కజొన్న, శనగ సాగు గణనీయంగా తగ్గింది. సాధారణ విస్తీర్ణం కన్నా శనగ 40 శాతం సాగు తగ్గిందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మూడు జిల్లాల్లో సాధారణ విస్తీర్ణం 1,24,295 ఎకరాలు కాగా 66,675 ఎకరాల్లో శనగ సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 1,46,462 ఎకరాలు కాగా 85,095 ఎకరాల్లో మాత్రమే సాగైంది.

పొగాకు సాగు ఇలా(ఎకరాల్లో)..

జిల్లా	సాధారణ విస్తీర్ణం	సాగు	శాతం
పల్నాడు	6348	15,803	248.94
బాపట్ల	17,320	57,490	331.92
గుంటూరు	2,310	8,423	364.63



కొనుగోళ్లలో.. కుంభకోణం

- పేదల పేరిట దోపిడీపై కూటమి ప్రభుత్వం దృష్టి
- విజిలెన్స్ విచారణపై అక్రమార్కుల గుండెల్లో వణుకు
- పక్కాగా విచారిస్తే భారీ స్కాం వెలుగులోకి వచ్చే అవకాశం
- నాడు వైసీపీ ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే భూముల కొనుగోళ్లు
- సర్వే నెంబర్ల లీక్‌తో భూములను కొని ప్రభుత్వానికి అధిక ధరకు విక్రయం

నవరత్నాల పేరుతో అధికారం చేపట్టి.. పేదలందరికీ స్థలాలు, ఇళ్లు అని భారీ భూ కుంభకోణానికి నాటి వైసీపీ పాలకులు పాల్పడ్డారు. పేదల ఇళ్ల కోసం అంటూ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వ్యాప్తంగా నాడు సేకరించిన భూముల్లో రూ.కోట్లు కొల్లగొట్టారు. అతి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేయడం.. వాటినే అత్యధిక ధరకు ప్రభుత్వానికి అంటగట్టారు. ఈ కొనుగోళ్ల వ్యవహారంలో భారీ కుంభకోణాలు ఉన్నాయని నాడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి పార్టీలు ఆందోళనలు చేశాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఆ కొనుగోళ్ల కుంభకోణాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో నాటి భూ మాయలో భాగస్వాములుగా ఉన్న వైసీపీ నేతలు, అధికారుల గుండెల్లో వణుకు మొదలైంది. విజిలెన్స్ విచారణ పక్కాగా జరిగితే మూడు జిల్లాల పరిధిలో భారీ భూ స్కాంలు వెలుగుచూస్తాయని ప్రజలతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

(గుంటూరు, బాపట్ల-ఆంధ్ర జ్యోతి)

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే జగనన్న కాలనీల పేరుతో భూసేకరణ జరిగింది. భూసేకరణ ఎక్కడైనా రెవెన్యూ శాఖ కనుసన్నల్లో జరుగుతుంది. కానీ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో మాత్రం అంతా అప్పటి ఎమ్మెల్యేలు, వైసీపీ నేతల పర్యవేక్షణలోనే జరిగింది. భూముల ధరలను ఆసాంతం పెంచేసి ప్రభుత్వానికి వాటిని స్వాధీనం చేసి కొద్ది రోజుల్లోనే రూ.కోట్లకు పడగలెత్తారు. పేదలందరికీ ఇళ్లు అని చెబుతూ వైసీపీ నేతలు కొనుగోళ్ల కుంభకోణానికి తెర లేపారు. భూసేకరణలో పెద్ద ఎత్తున ధర వెచ్చించి వాటిని

జగనన్న కాలనీలకు భూసేకరణలో అక్రమాలు

కొనుగోలు చేసే ఇన్‌సైడర్ ట్రేడింగ్ ప్రక్రియ గత ప్రభుత్వంలో పెద్ద ఎత్తున సాగింది. ఈ అక్రమాలకు వైసీపీ కీలక నేతల సహకారంతో పాటు కొంతమంది అధికారుల సహకారం కూడా ఉండడంతో రాజమార్గంలో ప్రభుత్వ ఖజానాకు గండికొట్టి రూ.కోట్లు కొల్లగొట్టేశారు. ముంపుప్రాంతాలు, శ్మశానాల సమీపంలో, ఊరికి చివరన జనసంచారం లేని చోట భూములను సేకరించి వాటిని జగనన్న లేఅవుట్లుగా మార్చారు. కొందరు ఎమ్మెల్యేలు అయితే భూ యజమానులతో ముందుగానే ఒప్పందాలు చేసుకున్నారు. మీ భూమికి మంచి ధర ఇప్పిస్తామని, అందుకు గాను తమకు 5 శాతం కమీషన్ ఇవ్వాల్సి ఉంటుందని మాట్లాడుకుని భూసేకరణ కింద భూములు ఇప్పించారు. అప్పట్లో తెనాలి మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనంద బాబు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఈ భూదోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు జరిపారు. అయితే వారి గళం అరణ్యరోదనైంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఈ భూ కుంభకోణంపై విచారణ జరిపితే వైసీపీ నేతల జేబుల్లోకి పోయిన ప్రజాధనం (మిగతా 6వ పేజీలో)

తెనాలి నుంచి బీజం

భూసేకరణలో లోగడ కుంభకోణాలు జరిగిన దాఖలాలు లేవు. అలాంటిది ఇందులోనూ అవినీతికి పాల్పడొచ్చని వైసీపీ నేతలు చేసి చూపించారు. తొలుత తెనాలి నుంచి ఈ కుంభకోణానికి బీజం పడింది. సర్వే నంబర్లను ముందుగానే తహసీల్దార్ల ద్వారా తెలుసుకుని ఆ భూములను ఎమ్మెల్యేలు వారి అనుచరుల ద్వారా కొనుగోలు చేశారు. ఆయా సర్వే నెంబర్లలో అప్పటి వరకు ఎకరం రూ.10 లక్షలుంటే ఒక్కసారిగా రెండు, మూడు రెట్లు పెంచి రిజిస్ట్రేషన్లు జరిపించారు. దాంతో వాటిల్లో సగటు భూమి రిజిస్ట్రేషన్ విలువ పెరిగింది. దానిని ప్రభుత్వానికి ఇవ్వడం ద్వారా అర్బన్‌లో అయితే ఒకటి, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 1.25 విలువని అదనంగా గుణకారం చేసి ఆ మొత్తాన్ని నష్టపరిహారంగా నాటి నేతలు జేబుల్లో వేసుకున్నారు.



చిన్నపాటి వర్షానికే బాపట్ల పరిధిలోని ప్యాడిసన్‌పేట జగనన్న కాలనీ దుస్థితి(ఫైల్ ఫొటో)

400 ఎకరాలు.. రూ.1300 కోట్లు

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 400 ఎకరాలకు పైగానే భూసేకరణ చేసి రూ.1300 కోట్ల పైచిలుకు ప్రజాధనాన్ని ప్రభుత్వ ఖజాన నుంచి చెల్లించారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే పేదల ఇళ్లకు అడ్డుపడతారా అని ఎదురుదాడికి దిగేవారు. అప్పట్లో భూసేకరణని పర్యవేక్షించిన రెవెన్యూ అధికారులు కూడా పండిపోయారు. ఊహించనంత ధర వస్తుండటంతో సంప్రదింపుల ద్వారానే భూసేకరణ ప్రక్రియ పూర్తి అయింది. జిల్లా స్థాయి అధికారి ఒకరైతే సూట్‌కేసులకు సూట్‌కేసుల నగదుని తీసుకెళ్లారని అప్పట్లో వైసీపీ నేతలే గుసగుసలాడారు.



ముందస్తుగానే.. పండుగ

- రాజధాని రైతులకు కౌలు విడుదల
- అమరావతి రైతుల్లో ఆనందోత్సాహాలు
- సీఆర్డీఏకు రాష్ట్ర ప్రభుత్వం రూ.255 కోట్లు విడుదల
- కౌలుకు రూ.229.7 కోట్లు.. పింఛన్లకు రూ.25.96 కోట్లు
- ఎట్టకేలకు అసైన్డ్ రైతుల మూడేళ్ల బకాయిలకూ మోక్షం



గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరం సమీపిస్తోంది. పండుగను ఆనందోత్సాహాల మధ్య కుటుంబసభ్యులు, బంధువుల సమక్షంలో స్వగ్రామాల్లో జరుపుకునేందుకు దూరప్రాంతాల నుంచి తరలి వస్తోన్నారు. అయితే నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల ఇళ్లలో ముందస్తుగానే పండుగ సంబరం నెలకొంది. రాజధాని రైతులకు రావాల్సిన కౌలు బకాయిలు, పేదలకు అందాల్సిన పింఛన్లు అందించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏపీసీఆర్డీఏ ప్రతిపాదనల మేరకు 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాలుగో క్వార్టర్ నిధుల కింద రూ.255 కోట్ల నిధులను రెండు రోజుల క్రితం విడుదల చేసింది. గతంలో కౌలు, పింఛన్ల కోసం ఎదురుచూపులతో సరిపెట్టాల్సి వచ్చేదని కూటమి ప్రభుత్వంలో ఆ బాధ తప్పిందని ఇప్పటికి రెండు విడతల కౌలు అందిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● పదో ఏడాది కౌలుకు మోక్షం

సీఆర్డీఏ ఒప్పందం ప్రకారం రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ప్రతి ఏటా వార్షిక కౌలు చెల్లించాలి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కౌలు ఎగవేస్తూ వారిని ఐదేళ్లుగా ఇబ్బందులపాలు చేసింది. న్యాయస్థానాల ద్వారా పోరాడి రైతులు మూడేళ్లపాటు కౌలు సాధించుకున్నారు. హైకోర్టు తీర్పును సైతం ధిక్కరిస్తూ చివరి రెండేళ్ల కౌలును వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. దీంతో వారికి 9, 10 సంవత్సరాలకు చెందిన వార్షిక కౌలు అందలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలు చెల్లింపులకు చర్యలు తీసుకుంది. కిందటేడాది ఆగస్టులో వారికి తొమ్మిదో ఏడాది వార్షిక కౌలు బకాయిలు చెల్లించింది. రైతులకు అందాల్సిన రూ.220 కోట్ల బకాయిలు చెల్లించింది. కాగా పదో ఏడాది వార్షిక కౌలు పెండింగులో ఉండగా దానికి సంబంధించి రైతుల నుంచి సీఆర్డీఏకు భారీగా విజ్ఞప్తులు వెళ్లాయి. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను కూడా రైతులు మంత్రులు లోకేశ్, నారాయణలను కలిసి తమ గోడు వినిపించుకున్నారు. దీంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. పండుగపూట వారికి తీపి కబురు అందించింది. రాజధాని రైతుల కౌలు చెల్లింపులకు కావాల్సిన నిధులు విడుదల చేస్తూ బుధవారం రాత్రి జీవో జారీ చేసింది. ఏపీ సీఆర్డీఏకు రూ. 229.71 కోట్లు విడుదల చేసింది.

అసైన్డ్ రైతులకూ పండుగే...

రాజధానికి భూములిచ్చిన అసైన్డ్ రైతులను గత వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా వేధించింది. వారి భూములపై సీఐడీ విచారణకు ఆదేసించి, వాటిని నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టి మూడేళ్లుగా వారికి రావాల్సిన కౌలు ఆపేసింది. దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురై, అప్పులపాలయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 3,120 మంది రైతులను దశలవారీగా సీఐడీ కేసుల నుంచి విముక్తి చేసి, వారికి కౌలు చెల్లించేందుకు పూనుకుంది. ఇప్పటికే వారికి సంబంధించిన కౌలు ప్రతిపాదనలు ఆర్థిక శాఖకు వెళ్లినా నిధులు లేకపోవడంతో అది పెండింగులో పడింది. తాజాగా ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో వారికి కౌలు కష్టాలు తీరనున్నాయి. మూడేళ్ల కౌలు వారికి అందిస్తామని సీఆర్డీఏ అధికారులు చెబుతున్నారని అసైన్డ్ రైతులు చెబుతున్నారు.

పింఛన్లకూ ఢోకా లేదు

రాజధాని పరిధిలోని భూమి లేని నిరుపేదలకు పింఛను అందజేస్తామని అప్పట్లో టీడీపీ ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి నెలా వారికి రూ.5 వేలు చొప్పున పింఛను అందించాల్సి ఉంది. ఆ పింఛన్లకు కూడా ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రభుత్వం నిధులు కేటాయించింది. రూ.25.96 కోట్లు సామాజిక భద్రతా నిధి కింద విడుదల చేసింది. దీంతో రాజధాని రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

రైతుల సంతోషమే కూటమి లక్ష్యం

● అత్తోటలో మినీ గోకులం ప్రారంభోత్సవంలో మంత్రి నాదెండ్ల

కొల్లిపర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులందరూ సంతోషంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని అత్తోటలో మినీ గోకులం షెడ్డును మంత్రి, కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ వ్యవసాయం, పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకుంటూ రైతులు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్ వ్యవస్థలో మార్పులు తీసుకువస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం రూ.11 లక్షల కోట్లు అప్పు చేసిందని, వాటిని తీర్చడమే కాకుండా అమరావతి, పోలవరం నిర్మాణాలకి ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో 175 సీసీ రోడ్లుకు నిధులు మంజూరు చేయగా, 60 శాతం నిర్మాణాలు పూర్తి అయినట్లు తెలిపారు. 386 మినీ గోకులాలు మంజూరు చేయగా ఇప్పటికే 170 మంది షెడ్లు నిర్మించుకున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సిద్ధార్థ, డ్వామా పీడీ శంకర్, డీపీవో సాయికుమార్, పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ నరసింహరావు, డీడీ పద్మావతి, ఏడీ నరేంద్రబాబు, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ భార్గవ్, నాయకులు దివ్వెల వెంకయ్యనాయుడు, అడపా నారాయణరెడ్డి, దివ్వెల ఏడుకొండలు, దాసరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, పక్కన కలెక్టర్ నాగలక్ష్మి

6 హైకోర్టులో ఉద్యోగం, రియల్ ఎస్టేట్ పేరుతో మోసం ● రూ. 59 లక్షలు వసూలు చేసిన నిందితుడు చుక్కా బాబు అరెస్టు

గణపవరంలో రూ.20 లక్షల విలువైన సొత్తు చోరీ

ఆరేళ్లుగా రోడ్డుకు అడ్డుగా ఉన్న గోడ తొలగింపు

8 రాజధానిలో కంకర దొంగలు ● కృష్ణాయపాలెం- శాఖమూరు రోడ్డును తవ్వేసిన దుండగులు

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. నంబూరు గ్రామం జాతీయ రహదారి పక్కన 'దీనీ ఇజ్‌తిమా' ప్రార్థన మందిరంలో గుంటూరు, కృష్ణా, ఏలూరు జిల్లాల ముస్లింల ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ముస్లింల ప్రార్థన కార్యక్రమానికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇలాంటి పవిత్ర ప్రార్థనలు మా నియోజకవర్గంలో జరగటం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మూడు జిల్లాల ముస్లిం మత పెద్దలు, టీడీపీ ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడి ఆత్మహత్య

బాపట్లరూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు ఉరివేసుకొని మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. బాపట్ల రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామానికి చెందిన గవిని వెంకటసాయి కిరణ్ (24) కుటుంబ కలహాల నేపథ్యంలో ముత్తాయపాలెం గ్రామశివారులో ఉన్న పశువుల పాకలో ఉరివేసుకొని మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు తెలపటంతో సంఘటనా స్థలానికి చేరుకొని సాయికిరణ్ మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బాపట్ల రూరల్ పోలీసులు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 565.20 అడుగులు ఉంది. ఇది 244.62 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9800 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7768 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,852 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 54,120 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 54,120 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఆలపాటికి ఘన విజయం తేవాలి

● ఆత్మీయ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్



మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, పక్కన ఆలపాటి, నక్కా ఆనంద్ బాబు

తెనాలి రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కూటమి శ్రేణులంతా ఒకే తాటిపై నడుస్తూ ఆలపాటిని ఎమ్మెల్సీగా ఘన విజయంతో గెలిపించుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం పట్టణంలోని రత్నఫార్చ్యున్ కల్యాణ మండపంలో తెనాలి- వేమూరు నియోజకవర్గ పట్టభద్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కఠారి వాసుదేవ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్ రామకృష్ణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఏ విధంగా దిగజార్చాడో అందరం చూశామన్నారు. అమరావతి రాజధానిని నిర్వీర్యం చేయడంతోపాటు రోడ్లు, రైతులను సైతం ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. అప్పటి ప్రభుత్వ విధానాలపై ప్రజల తరుపున మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేసిన పోరాటం అభినందనీయమన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ వైసీపీ అధికార మదంతో చేసిన అన్ని ప్రయత్నాలపై మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తన ధైర్యశైలితో పోరాడారన్నారు. ఆయన తొలిగా తెలుగు యువత నాయకుడిగా తదుపరి ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన ఎంతో అనుభవం ఉందన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కఠారి వాసుదేవ నాయుడు మాట్లాడుతూ మంచి నాయకత్వానికి పట్టభద్రులందరూ ఓటు వేయాలన్నారు. ఉద్యోగుల ప్రతి సమస్యను ధైర్యంగా చెప్పే ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వంటి మంచి నాయకుడికి ఎమ్మెల్సీ సీటు ఇవ్వడంపై ఆనందంగా ఉందన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తనపై కూటమి ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాననీ, ప్రజలందరికీ మంచి జరిగేలా తన కార్యాచరణ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తన విజయాన్ని కాంక్షిస్తూ అభిమానాన్ని చాటుతున్నారని వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వారి ప్రసంగంలో ఆలపాటి గెలుపు ఆవశ్యకతను వివరించారు. తొలుత టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు సభా పరిచయం చేయగా రావిచిన్ని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో రెండు నియోజకవర్గాల గ్యాడ్యుయేట్ ఓటర్లు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

రంగారావు సేవా ప్రస్థాన స్వర్ణోత్సవాలు ప్రారంభం



డాక్టర్ రంగారావును సత్కరిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు

చిలకలూరిపేట, జనవరి11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సేవా సంస్థ ఆసిస్ట్ ఆవరణలో శనివారం అసిస్ట్ సంస్థ ఆపరేషనల్ డైరెక్టర్ డాక్టర్ జాష్టి రంగారావు సేవా ప్రస్థాన స్వర్ణోత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ వేడుకలలో భాగంగా తొలి రోజున రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మంత్రి స్వామి మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 9 జిల్లాల పరిధిలో ఉన్న వెయ్యి గ్రామాల్లో అసిస్ట్ సంస్థ అత్యుత్తమ రీతిలో సేవలను అందిస్తుందని చెప్పారు. శాసన సభ్యులు డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్, ప్రత్తిపాటి పుల్లారావు, ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, ఏలూరి సాంబశివరావు, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు పాల్గొని మంత్రి స్వామితో కలిసి డాక్టర్ జాష్టి రంగారావును ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ అసిస్ట్ సంస్థ ద్వారా గ్రామీణ ప్రజానీకానికి రంగారావు చేస్తున్న సేవలు ప్రశంసనీయమైనవని అన్నారు. రంగారావుకు ఇటీవల సౌత్ వెస్టర్న్ అమెరికన్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయటం అందరికీ గర్వకారణమని అన్నారు. అసిస్ట్ సంస్థ అధ్యక్షుడు వడ్లమాని రవి, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలతో పాటు తెలంగాణ నుంచి పలు రోటరీ క్లబ్బులకు చెందిన ప్రతినిధులు, రోటరీ 3150 జిల్లా పూర్వ అధ్యక్షుడు ఏ.రత్న ప్రభాకర్, తాళ్ల రాజశేఖర్ రెడ్డి, వడ్లమాని రాజ్యలక్ష్మి, ఎస్.రామప్రసాద్, శరత్ చౌదరి తదితరులు రంగారావుకు ఆత్మీయ సత్కారం చేశారు. అసిస్ట్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ కృష్ణ హరీష్, విష్ణుప్రియ, డాక్టర్ కె.సాంబశివరావు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకొన్న ఎస్ఐ లోకేశ్వరావు



బాలుడు అభిచందును ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్ఐ లోకేశ్వరరావు

శావల్యాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కూలి పనులకు వెళ్లి సంక్రాంతి పండగ జరుపుకొనేందుకు సొంతూరుకు తిరిగి వస్తున్న పేదకుటుంబం రోడ్డు ప్రమాదానికి గురవ్వగా విషయం తెలుసుకొన్న శావల్యాపురం ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు తన పరిధి కాకపోయినా సంఘటనా స్థలానికి చేరుకొని హుటాహుటిన క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకొన్నారు. ఈ సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలోని సంతమాగులూరు మండలం వెల్లలచెరువు సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద శనివారం జరిగింది. పెద్ద అర్థవీడు మండలం పుచ్చకాయలపల్లి గ్రామానికి చెందిన పెద్ద చెన్నకేశవులు, భార్య లక్ష్మీదేవి జీవనోపాధి నిమిత్తం విజయవాడలో నివాసం ఉంటున్నారు. సంక్రాంతి పండగకు భార్యభర్తలు, ఐదేళ్ల కుమారుడు అభిచందుతో కలసి స్కూటీపై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో వెల్లలచెరువు వద్దకు రాగానే వినుకొండ నుంచి నర్సరావుపేటకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టింది. స్కూటీపైఉన్న ముగ్గురు రోడ్డుపై పడి తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే గంటవారిపాలెం సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న శావల్యాపురం ఎస్ఐ లోకేశ్వరావు విషయం తెలియగానే సంఘటనా స్థలానికి వెళ్లి 108కి సమాచారం అందించి క్షతగాత్రులను నర్సరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి సంతమాగులూరు పోలీసులకు సమాచారం అందించారు. ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు భార్య లక్ష్మీదేవి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

ఇద్దరు వైసీపీ కార్యకర్తలు అరెస్టు

మాచర్లటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణానికి చెందిన ఇద్దరు వైసీపీ కార్యకర్తలు దాసరి శివ, కేశవ్‌లను శనివారం మాచర్ల పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. 2022 డిసెంబరు 16న మాచర్ల పట్టణంలో టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహిస్తుండగా వైసీపీ నేతలు దాడులకు దిగారు. టీడీపీ నాయకుల గృహాలు, పార్టీ కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై పట్టణ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. ఈ కేసులో దాసరి శివ ఏ43, కేశవ్ ఏ44గా ఉన్నారు. పట్టణ పోలీసులు శనివారం వీరిని అరెస్టు చేసి మాచర్ల పట్టణంలోని సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి ప్రశాంత్ వీరికి 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితులను పోలీసులు గురజాల సబ్‌జైల్‌కు తరలించారు.

గణపవరంలో రూ.20 లక్షల విలువైన సొత్తు చోరీ

నాదెండ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గణపవరంలోని తూబాటి శేషగిరిరావు(శేషు) ఇంట్లో చోరీ జరిగింది. సుమారు రూ.20 లక్షల విలువైన సొత్తును చోరీ చేశారు. శేషగిరిరావు కుమార్తె ఆస్ట్రేలియా నుంచి రావటంతో కుటుంబ సభ్యులు అందరూ ఈ నెల 10న ఇంటికి తాళం వేసి శ్రీశైలం వెళ్లారు. రాత్రి 9 గంటలకు తిరిగి ఇంటికి వచ్చిన వారు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. ఇంటి వెనుక ఉన్న వంట గది తలుపులను లోపలకు నెట్టి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. కబోర్డులను పగలగొట్టి దానిలో ఉన్న బీరువా తాళాలను తీసుకొని బీరువాను తెరిచారు. కబోర్డుతోపాటు బీరువాలో ఉన్న సుమారు 30 సవర్ల బంగారు ఆభరణాలతోపాటు కొంత నగదును చోరీ చేశారు. సంఘటనా స్థలాన్ని శుక్రవారం రాత్రి ఎస్ఐ పుల్లారావు పరిశీలించారు. శనివారం తెల్లవారు జామున గ్రామానికి వచ్చిన క్లూస్ టీమ్ వేలి ముద్రల నమూనాలను సేకరించారు. శేషగిరిరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనుగోళ్లలో.. కుంభకోణం

(5వ పేజీ తరువాయి)

లెక్క తేలుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. భూసేకరణకు సంబంధించిన ఫైళ్లన్ని కలెక్టరేట్ రెవెన్యూ విభాగం వద్ద భద్రంగా ఉన్నాయి. విజిలెన్స్ కనుక ఆ ఫైళ్లను తీసుకుని విచారణ జరిపితే అక్రమాలు ఇట్టే వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నది. ఈ కుంభకోణంలో ఒక రిటైర్డు ఉన్నతాధికారి పాత్ర ప్రముఖంగా ఉన్నట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. అలానే జాయింట్ కలెక్టర్లు, ఆర్‌డీవోలు, తహసీల్దార్ల పాత్రలు కూడా బయటపడతాయి.

కాలనీలు.. కన్నీళ్లు

ఇళ్ల కోసం స్థలాలను పెద్ద మొత్తంలో డబ్బు వెచ్చించి కొనేటప్పుడు అవి నివాసయోగ్యమా కాదా అనే అంశంతో పాటు లోతట్టు ప్రాంతమా, వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉందా అన్న అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. కానీ నాటి భూసేకరణలో కేవలం ఎంత మొత్తంలో కొల్లగొట్టవచ్చు అన్న దానికే నేతలు పరిమితం కాగా వారికి అధికారులు పూర్తిగా సహకరించారు. దీంతో మూడు జిల్లాల పరిధిలోని అనేక ప్రాంతాల్లోని లేఅవుట్లలో స్థలాలు నివాసయోగ్యంగా లేవు. దీంతో లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు వెనుకంజ వేయడంతో ప్రస్తుతం అవి అడవులను మరపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో భూములు కొనడంతో వాటిని మెరక చేయడానికి పెద్ద ఎత్తున మట్టి తోలి ఈ క్రాంటాక్టుల్లో కూడా పెద్దమొత్తంలో నేతలు లబ్ధి పొందారన్న ఆరోపణలున్నాయి.

అక్రమాల్లో మచ్చుకు కొన్ని..

- తాడికొండ నియోజకవర్గంలో వాగు, చెరువు పోరంబోకు భూములను కూడా భూసేకరణ చేయించి సొమ్ము చేసుకున్నారు.
- జొన్నలగడ్డలో ఎకరానికి రూ.80 లక్షలకు పైగా చెల్లించారు.
- తెనాలికి సమీపంలోని జంపనిలో ఎకరానికి రూ.55 లక్షలు చెల్లించారు.
- వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులో ఎకరానికి రూ.52 లక్షలు చెల్లించారు.
- కొల్లూరులోని మొసలిపాడులో ఎకరానికి రూ.30 లక్షలు చెల్లించారు.
- పొన్నూరులోని దండమూడిలో రూ.50 లక్షలు ఇచ్చారు.
- వినుకొండలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పనికి రాని భూములనే ఎకరం రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు చెల్లించి సేకరించారు.
- బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండల పరిధిలోని ఓ గ్రామంలో ఎకరం 25 లక్షల ధర ఉంటే ఇక్కడ జగనన్న కాలనీల భూసేకరణ పేరిట దాదాపు రూ.75 లక్షలు వెచ్చించారు.
- ఈస్ట్ బాపట్ల పరిధిలో 35 ఎకరాల అసైన్డ్ భూమిని అప్పట్లో సేకరించారు. ఇందుకోసం ఇచ్చిన పరిహారం దాదాపు రూ.25 కోట్లుకాగా ఇందులో అధిక మొత్తం వైసీపీ నేతల జేబుల్లోకే పోయిందన్న ఆరోపణలు ఉన్నాయి.
- వేమూరు నియోజకవర్గ పరిధిలో కూడా పేదలకు ఇళ్ల స్థలాల పేరిట భారీ దోపిడీ జరిగినట్లు తెలుస్తోంది.
- బాపట్ల జిల్లాలో 287 లే అవుట్లను వేయగా దాదాపు 55 లే అవుట్ల కోసం చేసిన భూసేకరణ అనుమానంగా ఉండడంతో రెవెన్యూ యంత్రాంగం వాటిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది.

హైకోర్టులో ఉద్యోగం, రియల్ ఎస్టేట్ పేరుతో మోసం

● రూ. 59 లక్షలు వసూలు చేసిన నిందితుడు చుక్కా బాబు అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ వినోద్‌కుమార్

మంగళగిరి సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్, ఉద్యోగాలు ఇప్పిస్తానని అమాయకులను నమ్మించి రూ.లక్షల్లో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని మంగళగిరి అర్బన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరి అర్బన్ పోలీసు స్టేషన్‌లో సీఐ డి.వినోద్‌కుమార్ శనివారం నిందితుడి వివరాలను వెల్లడించారు. గుంటూరు రాజీవ్‌నగర్‌కు చెందిన చుక్కా బాబు అలియాస్ లవ్ బాబు గత కొన్నేళ్లుగా మంగళగిరిలో నివసిస్తూ కారు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. బాబు, అతని కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి పథకం ప్రకారం ఖరీదైన కార్లను అద్దెకు తీసుకుని తిరుగుతుంటారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద అమాయకులు కన్పిస్తే వారితో ఎంతో నమ్మకంగా పరిచయం ఏర్పరచుకుని, తమకు మంచి పలుకుబడి ఉందనీ, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.లక్షల్లో వసూలు చేసి ఆ డబ్బుతో జల్సాలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఏడాది క్రితం పొన్నూరుకు చెందిన దాసరి రామమోహనరావు అనే వ్యక్తిని బాబు, అతని స్నేహితులు వంశీకృష్ణ, తరుణ్‌లతోపాటు కుటుంబ సభ్యులు పరిచయం చేసుకున్నారు. రామమోహనరావు తమ్ముడికి హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. అంతటితో ఆగకుండా హైకోర్టులో స్టెనోగా పనిచేసే అరుణ్ అనే వ్యక్తి మృతి చెందాడనీ, అతని పేరు మీద రాజధానిలో రెండెకరాల భూమి ఉందని నమ్మించారు. ఆ భూమి నలుగురు హైకోర్టు న్యాయమూర్తుల కస్టడీలో ఉందనీ, రూ.50 లక్షలు చెల్లిస్తే ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెప్పి మొత్తం రూ.59 లక్షలను రామమోహనరావు వద్ద నుంచి తీసుకున్నారు. రోజులు గడుస్తున్నా రిజిస్ట్రేషన్ చేయించకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన రామమోహనరావు మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రధాన నిందితుడు చుక్కా బాబును విజయవాడలో అరెస్టు చేసి మంగళగిరి కోర్టుకు హాజరు పర్చగా, న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ వినోద్‌కుమార్ తెలిపారు.

ఆరేళ్లుగా రోడ్డుకు అడ్డుగా ఉన్న గోడ తొలగింపు



పొనుగుపాడులో అడ్డుగా ఉన్న గోడను తొలగించి చదును చేస్తున్న జేసీబీ

ఫిరంగిపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొనుగుపాడు గ్రామంలో గత ఆరేళ్లుగా రెండు వర్గాల మధ్య వైషమ్యాలకు కారణమైన దారి గోడను రెవెన్యూ, పంచాయతీ, పోలీసు అధికారులు ఎట్టకేలకు జేసీబీతో పడ గొట్టించారు. శనివారం రోడ్డుకు అడ్డంగా ఉన్న గోడను పడగొట్టారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ గోడను గ్రామంలో వైసీపీ వర్గానికి చెందిన వారు నిర్మించారు. అప్పటి నుంచి తెలుగుదేశం పార్టీకి చెందిన వర్గం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం కన్పించలేదు. గోడను నిర్మించిన స్థలం చర్చికి సంబంధించిందనీ, దీనికై ప్రహరీ గోడ నిర్మించామని వైసీపీ వర్గం చెబుతుండగా, గోడ కట్టిన స్థలం గ్రామ కంఠంలోనిదనీ, తమ పూర్వీకులు రాకపోకలకు దీనిని వినియోగించేవారనీ, అక్రమంగా గోడను నిర్మించి రహదారికి అడ్డు వేశారని తెలుగుదేశం పార్టీకి చెందిన వర్గం ఆరోపిస్తుంది. స్థానిక అధికారులు మాత్రం ఈ వివాద స్థలం గ్రామ కంఠంగా ఉందనీ, ప్రజల రాకపోకలకు అడ్డుగా ఉన్న గోడను పడ గొట్టామని తెలిపారు. గోడను పడగొట్టడంతో ఎలాంటి వివాదాలు జరగకుండా 180 మంది పోలీసు బలగాలతో ఏఆర్ అడిషనల్ ఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119.127.137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

డీటీడబ్ల్యూవోగా నారాయణ

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారిగా (డీటీడబ్ల్యూవో) బందెల నారాయణ నియమితులయ్యారు. డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న ఆయన గత కొన్ని నెలల నుంచి పోస్టింగ్ కోసం జీఏడీలో నిరీక్షిస్తున్నారు. ఎట్టకేలకు శనివారం ఆయనకు గుంటూరు జిల్లాలో పోస్టింగ్ కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

సివిల్ సప్లయిస్ విజిలెన్స్ డీసీగా రంగయ్య

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల జిల్లా శాఖ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్‌గా సీహెచ్ రంగయ్య నియమితుడయ్యారు. రెవెన్యూ శాఖకు చెందిన ఆయన్ని డిప్యూటేషన్‌పై సివిల్ సప్లయిస్ డిపార్టుమెంట్‌లో చేర్చుకొంటూ ఆ శాఖ ఎక్స్ అఫీషియో సెక్రెటరీ జీ వీరపాండియన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏబీ వెంకటేశ్వరరావును వేధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు(తూర్పు), జనవరి 11(ఆంధ్రజ్యోతి): మాజీ డీజీపీ ఏబి వేంకటేశ్వరరావును సరైన కారణం లేకుండా సస్పెండ్ చేసి, కోర్టు చెప్పినా కూడా పోస్టింగ్ ఇవ్వకుండా వేధించిన వైసీపీ ప్రభుత్వంపై, దీనికి సహకరించిన అధికారులపై విచారణ జరిపి కఠిన చర్యలను తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది జొన్నలగడ్డ దివాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దీనిపై ఈ నెల 9న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కలిసి ఫిర్యాదు చేశామని అన్నారు. విచారణ త్వరితగతిన చేస్తామని విజయానంద్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. దీనిపై ప్రభుత్వం కూడా కార్యచరణ రూపొందిస్తుందని అన్నారు. ఏబీ వెంకటేశ్వరరావుకు తగు న్యాయం చేయాలని , ఆయన సేవలను ప్రభుత్వం వినియోగించుకోవాలని కోరారు.



స్వామి వారి కళ్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వైభవంగా శ్రీరామ కల్యాణ మహోత్సవం

గుంటూరు, (తూర్పు), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతీనగర్‌లోని మారుతి దేవాలయంలో శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం గతంలో నిర్వహించిన పారాయణల మహాహోమ పూర్ణాహుతి జరిగింది. సాయంత్రం వేదమంత్రాల నడుమ, వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులకు, దంపతులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాలను డాక్టర్ యూవీ సోమయాజులు, ఆలయ కమిటీ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా, శ్రీరామనామక్షేత్రంలో కూడారై పండుగను నిర్వహించారు. పాలు, నెయ్యితో తయారు చేసిన కుడారై పాయసం తయారు చేసి 108 పాత్రలలో నింపి స్వామివారికి సమర్పించారు.



శ్రీ రామనామక్షేత్రంలో కుడారై పండుగను నిర్వహిస్తున్న వేదపండితులు

ఆటో రంగానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి

● ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్

గుంటూరు, (తూర్పు), జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించి, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామన మూర్తి అన్నారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగంభవన్‌లో శనివారం యూనియన్ నగర మహాసభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు బ్యాడ్జీతో సంబంధం లేకుండా ప్రతి ఆటో కార్మికుడికి ఏడాదికి రూ 15 వేలు, యాభై ఏళ్లు నిండిన వారికి రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. సొంత ఆటో కొనుగోలు చేసేందుకు పావలా వడ్డీకే రుణాలు మంజూరు చేయాలన్నారు. ఆటోలకు పార్కింగ్ స్థలాలను కేటాయించాలని, కార్మికులకు పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ నగరంలో దాదాపు 32 ఆటోస్టాండ్‌లు ఏర్పాటు చేశామని, సమస్యలు యూనియన్ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో కూరాకుల రామ్ ప్రసాదు, మంగా శ్రీనివాసరావు, మేడా హనుమంతురావు, అకిటి అరుణ్ కుమార్, కోటా మాల్యాద్రి, రావుల అంజిబాబు, పుప్పాల సత్యనారాయణ పాల్గొన్నారు.

కోవెలమూడి నారాయణరావుకు నివాళి

గుంటూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జోన్- 5 ఇన్చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) తండ్రి కోవెలమూడి నారాయణరావుకు శాసనమండలి మాజీ సభ్యుడు, టీడీపీ ముఖ్య నేత టీడీ జనార్ధన్ నివాళులర్పించారు. గుంటూరు అశోక్‌నగర్‌లోని నాని కార్యాలయానికి వచ్చిన ఆయన, నారాయణరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

గుంటూరు సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన లారీ డ్రైవర్ దుర్గా శనివారం రాత్రి ఆత్మహత్యాయత్నం చేశాడు. పురుగుమందు తాగుతూ సెల్ఫీ వీడియో తీసుకోవడం కలకలం రేపింది. మిర్చి వ్యాపారుల వేధింపులు తాళలేక తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నాడు. దుర్గా స్నేహితులు, కుటుంబసభ్యులు అత్నన హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.

నేటి నుంచి జీఎంసీ సంక్రాంతి సంబరాలు

● ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లపై సమీక్షించిన జీఎంసీ కమిషనర్

● నాలుగు రోజులపాటు నిర్వహించనున్న వేడుకలు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మునిసిపల్ క్రీడా ప్రాంగణంలో నేటి నుంచి 15వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం సంక్రాంతి సంబరాల ఏర్పాట్లపై అధికారులు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు తెలుగు సంస్కృతీసంప్రదాయాలను ప్రతిబింబించేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. స్టేడియంలో మౌలిక వసతుల ఏర్పాటుకు అధికారులు, నిర్వహణ కమిటీ ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని తెలిపారు. సంబరాల్లో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ముగ్గుల పోటీలు (రంగోలి), మెహందీ (మహిళలు, పిల్లలకు) జరుగుతాయని తెలిపారు. సంబరాల్లో నిర్వహించనున్న వివిధ పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే ప్రజలు అధిక సంఖ్యలో తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు పిల్లలు, పెద్దలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, టీ.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, నిర్వహణ కమిటీసభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

ఐలాండ్స్, డివైడర్లపై దృష్టి సారించాలి

గుంటూరులోని ఐలాండ్స్ డివైడర్ల నిర్వహణపై ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గాంధీ పార్కు ఎదుట ఐలాండ్, డివైడర్లు, వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఎదుట ఉన్న పింక్ టాయ్‌లెట్స్‌ను, పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, పారిశుధ్యంను శనివారం ఆయన పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై సచివాలయ కార్యదర్శులకు, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ఐలాండ్స్ అభివృద్ధి, నిర్వహణపై ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. ఐలాండ్లలో పచ్చదనం పెంపు, నీటి స్ప్రింకర్ల మరమ్మతులు ఉంటే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డివైడర్లపై పచ్చదనం కోసం నాటిన మొక్కలు కొన్ని ప్రాంతాల్లో లేవని, ఆయా ప్రాం తాల్లో నూతన మొక్కలు నాటాలని, ఉన్న మొక్కలను ఎప్పటి కప్పుడు ట్రిమ్మింగ్ చేయాలని పార్కుల విభాగపు ఏడీహెచ్‌ని ఆదేశించారు. అలాగే, విజ్ఞాన మందిరం ఎదుట పింక్ టాయ్ లెట్స్‌ని పరిశీలించి, వాటి నిర్వహణ శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఓల్డ్‌క్లబ్ రోడ్డు, కుగ్లర్ హాస్పిటల్ రోడ్డులో ఆయన పర్యటించారు.

కోడిపందేలు అరికట్టేందుకు సంయుక్త తనిఖీ బృందాలు

● జిల్లా పశుసంవర్ధక అధికారి నరసింహారావు

గుంటూరు సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కోడి పందేలు అరికట్టేందుకు కలెక్టర్ నాగలక్ష్మీ ఆదేశాల మేరకు ప్రత్యేక సంయుక్త తనిఖీ బృందాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ఓ నరసింహారావు వెల్లడించారు. ఈ మేరకు శనివారం జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, పశు సంవర్ధక శాఖ అధికారులు, పశు వైద్యులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేల పేరిట కోళ్ళను హింసించడం, జంతువుల పట్ల హింస పాల్పడటం శిక్షార్హమైన నేరమని అన్నారు. కోడిపందేలు నిర్వహించుట జంతు హింస నివారణ చట్టం 1960, ఆంధ్రప్రదేశ్ గేమింగ్ చట్టం 1974 ప్రకారం శిక్షార్హమని, వాటిని అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులతో సంయుక్త తనిఖీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీ ఈ నెల 11వ తేదీ నుంచి 17 వరకు గ్రామాల్లో పర్యటించి తనిఖీలు నిర్వహిస్తారని అన్నారు. ఈ సందర్భంగా కోడిపందేల నివారణకు రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.



కోడి పందేలు అరికట్టేందుకు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మీ, పశుసంవర్ధక శాఖాధికారి నరసింహారావు

ఓబన్న వీరోచిత పోరాటం వెలకట్టలేనిది

గుంటూరు కార్పొరేషన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం వెలకట్టలేనిదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన స్వాతంత్ర్య పోరాటంలో ఆయన సైన్యాధ్యక్షుడిగా ఓబన్న వీరోచిత పోరాటం చేశారన్నారు. అటువంటి పోరాట యోధుని జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో నల్లమల అడవుల్లో జరిగిన కుంఫనీ వ్యతిరేక పోరాటంలో సైన్యాధ్యక్షుడిగా ముందుండి సైన్యాన్ని నడిపిన ఓబన్న పోరాట చరిత్ర నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, సీఎంఓహెచ్ డాక్టర్ అమృత, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, బయాలజిస్టు మధుసూదన్ పాల్గొన్నారు.

ఓబన్న పోరాటం స్ఫూర్తిదాయకం

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం స్ఫూర్తిదాయ కమని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం పేర్కొన్నారు. స్థానిక గుజ్జన గుండ్లలోని కార్యాలయంలో వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే ప్రాణాలర్పించారన్నారు. కార్యక్రమంలో దేవళ్ళ వేలాద్రి, తురకా రమేష్ శ్రీకాంత్, వేణు, రవి యాదవ్, పఠాన్ సైదాఖాన్, ప్రభు తదితరులు ఉన్నారు.



వడ్డే ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఏసురత్నం తదితరులు

పోలీస్ కార్యాలయంలో..

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న జయంతి వేడుకలు పోలీస్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఓబన్న చిత్రపటానికి ఎస్పీ సతీశ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రేనాటి ప్రాంత యుద్ధ వీరుడు వడ్డే ఓబన్న అని, నంద్యాల జిల్లాలోని సంజామల మండలం నొస్సం గ్రామానికి చెందిన వడ్డె సుబ్బయ్య, సుబ్బమ్మ దంపతులకు వడ్డే ఓబన్న 1807 జనవరి 11న జన్మించారన్నారు. అదనపు ఎస్పీ (ఏఆర్) హనుమంతు, వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్, సీసీఎస్ డీఎస్పీ శివాజీ రాజు, ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.



ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ సతీశ్‌కుమార్

నగరంలో తొలిసారిగా 100 విల్లాస్ నిర్మాణం

● సీతారామ్ టౌన్‌షిప్ అధినేత మామిడి సీతారామయ్య

గుంటూరు(తూర్పు), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో గ్రేటెడ్ కమ్యూనిటీలో తొలిసారిగా పది ఎకరాల స్థలంలో 100 సూపర్ లగ్జరీ విల్లాస్ నిర్మిస్తున్నట్టు సీతారామ్ టౌన్‌షిప్ అధినేత మామిడి సీతారామయ్య తెలిపారు. ఇదే ప్రాజెక్ట్‌లో మధ్య తరగతి ప్రజల కోసం 80 అపార్ట్ మెంట్లు కూడా నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. 20 ఏళ్ల అనుభవంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ నిర్మాణాలు చేపట్టామని అన్నారు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను స్థానిక చేబ్రోలు హనుమయ్య కంపెనీ వద్ద ఏర్పాటు చేసిన నరెడ్కో ప్రాపర్టీ షోలో కంపెనీకి సంబంధించిన స్టాల్స్ వద్ద సంప్రదించాలని కోరారు. చదరపు గజం విలువ రూ.4 వేలు ఉందని, ఆదివారంలోపు ప్లాట్లు బుక్ చేసుకునే వారికి రూ 2,999కే అందజేస్తామని అన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ప్రాపర్టీ షోకు విచ్చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మామిడి సీతారామయ్య

ఎన్‌సీసీ విద్యార్థులకు 'ఎ' సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్ష

గుంటూరు(విద్య), జనవరి 11 (ఆంధ్రజ్యోతి):సమాజం పట్ల బాధ్యతను నెరవేర్చే విధంగా విద్యార్థినీ విద్యార్థులకు క్రమశిక్షణా యుత జీవితాన్ని అలవర్చేందుకు నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ఎంతో తోడ్పడుతుంది అని 25 (ఎ) ఆంధ్ర బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ కుమార్ శర్మ పేర్కొన్నారు. స్థానిక పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌లో గుంటూరు గ్రూప్ ఎన్‌సీసీలో శిక్షణ పొందిన విద్యార్థినీ విద్యార్థులకు 'ఎ' సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్ష శనివారం నిర్వహించారు. ఈ పరీక్షకు గుంటూరు గ్రూప్ నుంచి మొత్తం 30 పాఠశాలలకు చెందిన 800 మంది క్యాడెట్స్ హాజరయ్యారు. రాత పరీక్ష అనంతరం డ్రిల్‌కు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన దీపక్ కుమార్ శర్మ పాల్గొని పరీక్షా విధానాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సాయుధ దళాల యువ విభాగం, సైన్యం, నేవీ, ఎయిర్ ఫోర్స్‌తో కూడిన ట్రై-సర్వీసెస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద ప్రాతిపదికన పాఠశాల, కళాశాల విద్యార్థులకు చిన్న ఆయుధాలు, డ్రిల్‌లో ప్రాథమిక సైనిక శిక్షణ అందిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో 25 ఆంధ్ర బెటా లియన్ సుబేదార్ మేజర్ విజయ్ మోహితి, 25 ఆంధ్ర బెటాలియన్ స్టాఫ్ పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన ఎన్‌సీసీ విద్యార్థినీ విద్యార్థులు

ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో స్థానిక ఎన్‌టీ ఆర్ బస్టాండ్‌లో శనివారం ప్రయాణికుల రద్దీ కొనసాగుతోంది. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతో పాటు జిల్లా పరిసర ప్రాంతాల నుంచి ప్రయాణికులు అధిక సంఖ్యలో నగరానికి చేరుకున్నారు. చదవు, ఉద్యోగాల నిమిత్తం గుంటూరులో నివసిస్తున్న వారు అనేక మంది తమ స్వస్థలాలకు పయనమయ్యారు. రెండో శనివారం, ఆదివారంతో పాటు వరుసగా పండుగ సెలవులు రావడంతో ఒక్కసారిగా ప్రయాణికుల రద్దీ పెరిగింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆయా రూట్లలో శనివారం అదనపు బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికుల సందడి కనిపించింది.



బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

'సంక్రాంతి రైతుల పండుగ'

గుంటూరు(విద్య),జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి విశిష్టతను తెలిపే రంగు రంగుల రంగవల్లులు, హరిదాసు సంకీర్తనలు, కోలాటాలతో తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో శనివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే రైతుల పండుగ అని, పండుగ ల్లోని విశిష్టతను, శాస్త్రీ యతను విద్యార్థులు గుర్తించాలని సూచించారు. తమ విద్యా సంస్థల్లో ఏటా అన్ని పండుగలను వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీ అని తెలిపారు. పిల్లలకు సంస్కృతీసంప్రదాయాలపై గౌరవం పెంచాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.



చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

సీఎం చంద్రబాబుకు వద్రాణం హరిబాబు శుభాకాంక్షలు

గుంటూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వద్రాణం హరిబాబు కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వలన రాష్ట్ర రూపురేఖలే మారిపోతున్నాయని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని అన్నారు. వెంటి లేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి ఆక్సిజన్ ఇచ్చి నిలబెట్టారని అన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి రామారావు పాల్గొన్నారు.



చంద్రబాబును కలిసిన వద్రాణం హరిబాబు, బొబ్బిలి రామారావు

రేపటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

గుంటూరు(తూర్పు), జనవరి 11(ఆంధ్రజ్యోతి): భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్, శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

సావిత్రిబాయి పూలే పోరాటం స్ఫూర్తిదాయకం: మంత్రి సవిత

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అట్టడుగు వర్గాలు, మహిళల విద్య కోసం సావిత్రిబాయి పూలే చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్. సవిత అన్నారు. టీడీపీ రాష్ట్ర బీసీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి దేవళ్ళ మల్లికార్జునరావు అధ్యక్షతన టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం సావిత్రిబాయి జయంతి కార్య క్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి సవిత, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి హాజ రయ్యారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రి బాయీ పూలే మహిళా, బాలికల విద్య కోసం ఎంతో కృషి చేశారన్నారు. బాల్య వివాహాలు, సతీసహగమనానికి వ్యతిరేకంగా ఆమె పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత సమాజంలో చరిత్రాత్మకమైన మార్పు కోసం సావిత్రి బాయి పూలే దంపతులు పునాది వేశారని అన్నారు. లింగ వివక్ష, కుల అసమానతలపై ఆమె చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొ రేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ధూళిపాళ్ల ఏసుబాబు, సింహాద్రి కనకాచారి, ముత్తినేని రాజేష్, లక్ష్మి శైలజ గౌడ్, దాసరి జ్యోతి తదితరులు పాల్గొన్నారు



సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే మాధవి

మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి సేవలు

మహిళల అభ్యున్నతి కోసం సావిత్రి బాయి పూలే చేసిన సేవలు మరువలేని వని టీడీపీ జోన్- 5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు అశోక్‌నగర్ లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా జరిగాయి. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి టీడీపీ నేతలు నివాళు లర్పించారు. కార్యక్రమంలో కసుకుర్తి హనుమంతరావు, మైనం లక్ష్మీ నారాయణ, ఓర్సు శ్రీనివాసరావు, షేక్ సుభాని, చిన బాజీ పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోవెలమూడి రవీంద్ర

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అన్న సంతర్పణ

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ అగ్రహారంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభ వంగా జరుగుతున్నాయి. జన సేన 18వ డివిజన్ అధ్యక్షుడు శానం రమేష్ ఆధ్వర్యంలో ద్వాదశి సందర్భంగా శని వారం భక్తులకు అన్న సంత ర్పణ కార్యక్రమం నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఇప్పటికే ఆలయంలో విశేష పూజలతో పాటు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ద్వాదశి శని వారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీబీకే జేఏసీ అధ్యక్షుడు దాసరి రాము, ఉగ్గిరాల సీతరామయ్య, వనమా నరేంద్ర , టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు హాజరయ్యారు.



అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రమేష్ తదితరులు

రూ. 80 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గుంటూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. స్థానిక 8వ డివిజన్‌లో రూ. 34 లక్షల 50 వేలు, 3వ డివిజన్‌లో రూ. 36 లక్షల 50వేలు, 4వ డివిజన్‌లో రూ. 17 లక్షలతో సీసీ డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్న ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి ఏకతాటిపై నడుస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా మారుస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, జే. శ్రీనివాస్, జే. జస్వంత్, జడ సురేష్, రబ్బాని, అల్లం బాజీ, పిచ్చిరెడ్డి, ఎం. నరసింహారావు, వీ. ఏడుకొండలు, మహమ్మద్ గౌస్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఏఆర్‌టీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు

గుంటూరు మెడికల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డులోని ఛాతీ, సాంక్రమిక వ్యాధుల ప్రభుత్వ ఆసుపత్రిలోని ఏఆర్‌టీ కేంద్రంలో శనివారం చిన్నారులతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలతో, రంగవల్లి, గొబ్బెమ్మలతో, మామిడి తోరణాలు, పూలమాలలతో సంక్రాంతి పండుగ శోభను తెచ్చారు. తెలుగు సంప్రదాయ వంటలతో, సంక్రాంతి పిండి వంటలు, పొంగలి, గారెలు, బూరెలు, భోగికి గుర్తుగా పులగం, కనుమకు గుర్తుగా చికెన్ కూరతో ఆహారం పంపిణీ చేశారు. పౌష్టికాహారం పంపిణీలో భాగంగా యాపిల్, కమల, అరటి పళ్ళు, పప్పు ఉండలు చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఆర్‌టీ కేంద్రంలో లైబ్రరీని ఐసీటీసీ కేంద్రాల జిల్లా సమన్వయకర్త జే వీరాస్వామి ప్రారంభించారు. డాక్టర్ వెన్నెల, డాక్టర్ సరిత, కౌన్సెలర్లు కోటిరత్నం, సౌజన్య, భాగలక్ష్మి పాల్గొన్నారు.



భోగి మంటలతో సంక్రాంతి వేడుకలు

ఘనంగా కూడారై ఉత్సవం

స్థానిక నంది వెలుగు రోడ్డులోని వస్త్రనగరంలో కొలువైన పద్మావతి, గోదాదేవి సమేత కామ్యసిద్ధి వెంకటాచల స్వామి దేవాలయంలో శనివారం కుడారై ఉత్సవం ఘనంగా నిర్వహించారు. 108 గంగాళాలతో కూడారై పాయసం నింపి పెరుమాళ్లకు నివేదించడం ద్వారా ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా జరిపారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో ఈ నెల 13న గోదా రంగనాధ కళ్యాణం ఘనంగా నిర్వహిస్తు న్నట్లు దేవస్థానం కమిటీ అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, కార్యదర్శి మండవ వెంకటకట శేషగిరిరావు తెలిపారు. దేవస్థానంలో ప్రతిరోజూ పూజ అనంతరం తీర్థప్రసాదాల పంపిణీ ఉంటుందని, భక్తులు కైంకర్య కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఆకట్టుకున్న గ్రాండ్ మ్యూజికల్ నైట్

గుంటూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చిష్టీ కల్చరల్ ఈవెంట్స్ అధ్యక్షుడు ఎండీ పర్వేజ్ చిష్టీ ఆధ్వర్యంలో స్థానిక అమరావతి రోడ్డులోని అన్నదాన సత్రంలో శనివారం గ్రాండ్ మ్యూజికల్ నైట్ ఆహూతులను ఆకట్టుకుంది. పలువురు కళాకారులు సూపర్ స్టార్ కృష్ణ చిత్రాల పాటలను ఆలపించారు. ఈ సందర్భంగా తపాలాశాఖ విశ్రాంత ఉద్యోగి ఆర్‌పీఎల్ నరసింహారావుకు 'సకల కళావల్లభ' అనే బిరుదుతో సత్కరించారు. అనంతరం నరసింహారావు మాట్లాడుతూ తన సంగీత సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ఇవ్వటంపై కృతజ్ఞతలు తెలియజేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి, కన్నా మాష్టారు, తూములూరి రాజేంద్రప్రసాద్, వెంకా యమ్మ, జమదగ్ని, బిల్లా అశోక్, రత్నారెడ్డి, మధుబాబు, ఇస్మాయిల్, అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్





ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత



ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

రాజధానిలో కంకర దొంగలు

● కృష్ణాయపాలెం- శాఖమూరు రోడ్డును తవ్వేసిన దుండగులు

● గత వైసీపీ హయాంలోనూ యథేచ్ఛగా నెక్కల్లు వద్ద దోపిడీ



రోడ్డును తవ్వుకుపోగా ఏర్పడిన లోతైన గుంతలు

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో మళ్లీ కంకర దొంగలు చెలరేగిపోయారు. రెండు రోజుల క్రితం మంగళగిరి మండలం కృష్ణాయపాలెం- శాఖమూరు మీదగా అనంతవరం వెళ్లే రోడ్డును తవ్వేశారు. ఎక్స్‌కవేటర్‌తో తవ్వి లారీల్లో కంకర, మట్టిని తరలించుకుపోయారు. దాదాపు 200 మీటర్ల మేర 3 అడుగుల లోతులో రోడ్డును తవ్వారు. 25, 30 టిప్పర్లతో మట్టి, కంకర తరలించుకుపోయారు. పశువుల కాపరులు గమనించి ఈ విషయాన్ని రైతులకు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా గతంలోలా మట్టి, కంకర దొంగతనం జరగడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, సీఆర్డీఏ అధికారుల నిర్లక్ష్యం, వైఫల్యం కారణంగానే దోపిడీలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. మంత్రి లోకేశ్ నియోజకవర్గంలో ఇలా దోపిడీ జరగడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

● గత వైసీపీ హయాంలో మట్టి, కంకర, ఇసుక దొంగలు యథేచ్ఛగా చెలరేగి పోయారు. రాజధానిలో రోడ్లన్నింటినీ తవ్వుకుపోయారు. అప్పటి అధికార పార్టీ అండతో అక్రమార్కులు అడ్డుఅదుపు లేకుండా చెలరేగి పోయారు. రాజధాని నిర్మాణం కోసం తెచ్చిన ఇనుము, ఇసుకను కాజేసిన దొంగలు రోడ్లను తవ్వుకుని కంకర, గులక ఇసుకను తవ్వుకుపోయారు. 2022లో సాక్షాత్తు రాష్ట్ర అసెంబ్లీకి కూతవేటు దూరంలో రోడ్డును తవ్వి గులకరాయి తవ్వుకుపోయిన ఘటన గతంలో సంచలనంగా మారింది. రాజధాని రైతులు, మహిళలు అడ్డుకున్నా అక్రమాలను ఆగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధాని పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇక ఎలాంటి ఇబ్బంది ఉండదులే అనుకుంటున్న సమయంలో మళ్లీ కంకర దొంగల దోపిడీ రాజధానివాసులను ఉలిక్కి పడేలా చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అక్రమార్కులు ఇలా చెలరేగిపోవడానికి అధికారుల నిర్లక్ష్యం, వైఫల్యమే కారణమని రైతులు భావిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే మనుగడ సాధ్యం

● తెలంగాణ జీఎస్టీ జాయింట్ కమిషనర్ శ్రీలీల

తెనాలి రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం చేసే ప్రతి ఒక్కరూ ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని ఆపేసి పూర్వికులు ఆచరించిన ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులేస్తే రాబోయే రోజుల్లో రైతుల మనుగడ సాధ్యమవుతుందని తెలంగాణ జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎడ్ల శ్రీలీల తెలిపారు. మండలంలోని కొలకలూరులో శ్రీభారత్ ఫౌండేషన్, సేవ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంపై సస్యశ్యామలామ్ అనే కార్యక్రమం ద్వారా రైతులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ దేశంలో అత్యధికంగా ఆత్మహత్యలు చేసుకునే వారిలో రైతులే ఉండటం బాధాకరమన్నారు. ఎరువులు, పురుగుమందులు అధికంగా వాడటం వల్ల దిగుబడి వచ్చినా వాటికి అయిన ఖర్చుకు సరిపోకపోవడంతో రైతులు అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. గతంలో మన పూర్వీకులు వ్యవసాయంతోనే కుటుంబాల్లోని పిల్లలను మంచి విద్యావంతులుగా తీర్చిదిద్దుకోగలిగారని అప్పట్లో ఆత్మహత్యలు లేవన్నారు. సుభాష్‌పాలేకర్ కృషి(ఎస్‌పీకే) విజయరామ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. గోవులు, గేదెలు, వేప, ఇతర చెట్లతో సంప్రదాయ వ్యవసాయాన్ని చేసి అధిక లాభాలు గడించవచ్చన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న తెలంగాణ జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎడ్ల శ్రీలీల

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మేడికొండూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పేరేచర్ల సమీపంలో శనివారం రాత్రి 11గంటల సమయంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్తెనపల్లి వైపు నుంచి గుంటూరు వైపు బైక్‌పై వెళుతున్న ఏలూరు జిల్లా కలిదిండి గ్రామానికి చెందిన మేక భాగ్యరమేష్(30)ను వెనుక వైపు నుంచి వాహనం ఢీకొట్టడంతో కిందపడి అక్కడికక్కడే మరణించాడు. ఢీకొన్న వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. మేడికొండూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు.

హోరాహోరీగా ఎడ్ల పోటీలు

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రత్తయ్యచౌదరి మెమోరియల్ ప్రాంగణంలో రెండో రోజైన శనివారం ఆరు పళ్ల విభాగంలో నిర్వహించిన పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 11 జతల ఎడ్లు పాల్గొన్నాయి. వేటపాలేనికి చెందిన శిరీషచౌదరి ఎడ్ల జత 4800 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిని సాధించాయి. గుంటూరు జిల్లా మేడికొండూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి ఎడ్లు, పెదపరిమికి చెందిన శ్రీలక్ష్మి ఎడ్లు 4500 దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. బి.సుశ్మిత చౌదరి ఆకులపాడు (గుంటూరు)కు చెందిన ఎడ్లు 3,626 దూరం లాగి తృతియస్థానం, ఎస్.వెంకటరావు కొల్లవారిపాలెం(బాపట్ల) 3557 దూరంలాగి నాల్గో స్థానం, ఎం.అంజిరెడ్డి చెల్లగుండ (పల్నాడు జిల్లా) 3427 దూరం లాగి ఐదో స్థానం, వై.హుస్సేన్ ఎర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)కు చెందిన ఎడ్లు 3389 అడుగుల దూరం లాగి ఆరోస్థానంలో నిలిచాయి.

నాటక వారం.. చంద్రన్న వరం.. గొప్ప అవకాశం

● ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ

● రెండో రోజుకు గుంటూరు కళాపరిషత్ నాటక ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), జనవరి 11(ఆంధ్రజ్యోతి): వారం.. వారం.. నాటక వారం శనివారం.. చంద్రన్న వరం పేరుతో కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారని, ఇది సంస్థలు, కళాకారులకు గొప్ప అవకాశమని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తెలిపారు. గుంటూరు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న నాటక ప్రదర్శనలు రెండో రోజుకు చేరుకున్నాయి. ప్రదర్శనలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. నాటక ప్రదర్శనలకు టీటీడీ వారిచే పారితోషికం ఇప్పించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కళా పరిషత్ ఉపాధ్యక్షుడు నాయుడు గోపి మాట్లాడుతూ నాటక ప్రదర్శనలకు దాతల సహకారం మరువలేనిదన్నారు. నాటక రంగానికి గుమ్మడి గోపాలకృష్ణ చేస్తున్న సేవలను గుర్తించి రెండో సారి నాటక అకాడమీ చైర్మన్ పదవి వచ్చిందన్నారు. సభలో ఆడిటర్ బొల్లేపల్లి శ్రీనివాసరావు, కళా పరిషత్ సభ్యులు పోపూరి శివరామకృష్ణ, ఆవుల సుబ్బారావు ప్రసంగించారు. గుమ్మడి గోపాలకృష్ణను కళాపరిషత్ సభ్యులు గుమ్మడి నాగేశ్వరరావు, అలోకం పెద్దబ్బయ్య, పూర్ణ, మల్లికార్జునరావు సత్కరించారు. అనంతరం గంగోత్రి, పెదకాకాని వారిచే నాయుడు గోపి దర్శకత్వం వహించిన అష్టమ వసువు సాంఘిక పద్య నాటకాన్ని ప్రదర్శించారు.



గుమ్మడి గోపాలకృష్ణను సత్కరిస్తున్న గుంటూరు కళాపరిషత్ సభ్యులు



అష్టమవసువు నాటికలో ఓ సన్నివేశం

ఫొటో తీసుకునే ప్రయత్నం.. కాల్వలో గల్లంతు

● సంక్రాంతి సెలవులకు వచ్చిన ఎంబీఏ విద్యార్థి విషాదాంతం

మాచర్లటౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఫొటో తీసుకుందామని వెళ్లి కుడికాల్వలో ఓ విద్యార్థి గల్లంతైన సంఘటన మాచర్లలో జరిగింది. పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన ఆరే శ్రీనివాసరావు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి కుమారుడు, కుమార్తె సంతానం. కాగా కుమారుడైన అమరలింగేశ్వరరావు (21) విజయవాడలో ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిన అమరలింగేశ్వరరావు ఈ నెల 8న స్నేహితులతో కలిసి ఫొటోలు, వీడియోలు చేసేందుకు పట్టణంలోని బొంబాయి కంపెనీ కుడికాల్వ బ్రిడ్జి వద్దకు వెళ్లాడు. స్నేహితుడు వీడియో తీస్తుండగా కుడి కాల్వ బ్రిడ్జిపై నుంచి దూకాడు. నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. కుటుంబసభ్యులు కాల్వ వెంబడి గాలించినా ఇప్పటివరకు అమరలింగేశ్వరరావు ఆచూకీ తెలియలేదు. దీనిపై పట్టణ పోలీస్‌స్టేషన్లో ఎటువంటి కేసు నమోదు కాలేదు.



కాల్వలో దూకుతున్నట్లు ఫొటో తీసుకునే ప్రయత్నంలో అమరలింగేశ్వరరావు

నేటి నుంచి జాతీయస్థాయి కబడ్డీ పోటీలు

● ముప్పాళ్లలో రైతుమిత్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహణ

ఈపూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రైతుమిత్ర కబడ్డీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి 17వ తేదీ వరకు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు తల్లపనేని రామారావు తెలిపారు. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో డే అండ్ నైట్ పోటీలు జరుగుతాయన్నారు. సీఎం చంద్రబాబును కూడా పోటీలకు ఆహ్వానించినట్లు తెలిపారు. 33 ఏళ్లగా రాజకీయ, కుల, మతాలకు అతీతంగా పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల నిర్వహణలో గ్రామంలో ప్రతి ఒక్కరు తమకు చేతనైన సాయంచేస్తున్నారన్నారు. ఈ ఏడాది విజేతలకు రూ.9లక్షల వరకు బహుమతులు అందజేస్తున్నామన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి కల్పిస్తున్నామన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 50 జట్లు పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.



పోటీలకు ముస్తాబు గ్రౌండ్

ఎమ్మెల్యే ఫ్లెక్సీని చింపిన వైసీపీ మూకలు

● రూరల్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు

బాపట్ల రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎమ్మెల్యే ఫ్లెక్సీని వైసీపీ మూకలు చించిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ వైయస్సార్ నగర్ గ్రామంలో శనివారం సీసీ రోడ్ల ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా వైసీపీకి చెందిన రామలింగం పోలిరెడ్డి విద్యుత్ లైట్లను ఆపివేసి ఎమ్మెల్యే ఫ్లెక్సీని బ్లేడుతో చింపివేశాడు. ఎందుకు ఫ్లెక్సీలు చింపావని అదే గ్రామానికి చెందిన సమీట మల్లికార్జున్ రెడ్డి అడగగా తనను ఆసోది శ్రీనివాస్‌రెడ్డి, ఆసోది శివారెడ్డి, మరుప్రోలు ఇస్సాక్‌రెడ్డి పంపించారు, నువ్వు ఎవరు అడగడానికి అని తిడుతూ మల్లికార్జున్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డాడు. బాధితుడు మల్లికార్జున్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామలింగం పోలిరెడ్డి, ఆసోది శ్రీనివాసరెడ్డి, ఆసోది శివారెడ్డి, మరుప్రోలు ఇస్సాక్ రెడ్డిపై బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టా కాల్వకు 1818 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1818 క్యూసెక్కుల సాగునీటిని శనివారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.3 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 80 క్యూసెక్కుల నీరు, రేపల్లె కాల్వకు 140 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 290 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 120 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 90 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 520 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

ప్రీ క్వార్టర్స్‌కు చేరిన క్రికెట్ పోటీలు


క్రికెట్ ఆడుతున్న దృశ్యం

తాడేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి దేవుడు మాన్యంలో జరుగుతున్న టీఎస్ఎల్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు లీగ్ దశ ముగిసి ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. నాలుగో రోజు పోటీల్లో పాల్గొన్న జట్లకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కింద విజేతలకు సినీ హీరో రామ్‌చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ సినిమా టికెట్లను నిర్వాహకులు జొన్నా రాజేష్, గాదె వినయ్, కొల్లి శేష అందజేశారు. క్వార్టర్ ఫైనల్స్‌లో ఆరు మ్యాచ్‌లు జరగ్గా నరసింహ సీసీ, ఉండవల్లి రైడర్స్, యసి 11, మణిపాల్ రాక్స్‌తేజ 11 విజయం సాధించి సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. కార్యక్రమం లో జనసేన పార్టీ రాష్ట్ర ఐటీ కో ఆర్డినేటర్ చవ్వాకుల కోటేష్‌బాబు, టీడీపీ నేతలు మ న్నెం కిషోర్, తోట సాంబశివరావు, కాశిమల్ల దినేష్ చక్రవర్తి, జాతీయ కాపు సంఘం ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి రాము, ఆర్గనైజర్ గాజుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మారుతీ థియేటర్‌లో తనిఖీలు

ప్రత్తిపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని మారుతీ థియేటర్‌లో ప్రత్తిపాడు తహసీల్దార్ కరుణ కుమార్ తనిఖీలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రత్తిపాడులో ఎక్కువ ధరలకు టిక్కెట్లు అమ్ముతున్నారంటూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో గతంలో ఒకసారి తనిఖీలు చేసి థియేటర్ నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. తాజాగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన థియేటర్‌లో తనిఖీలు నిర్వహించి ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే టిక్కెట్ అమ్మకాలు చేయాలని సూచించారు.

బాల్య వివాహాలను అరికడదాం

వట్టిచెరుకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కోవెలమూడి గ్రామంలో బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమాన్ని కళాజాత రూపంలో శనివారం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు, వాటి వల్ల ఎదురయ్యే అనర్థాలు, శిక్షలు పడే అవకాశాలను వివరిస్తూ కళాజాత రూపంలో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ ఎండీ జెరీనా, పుల్లడిగుంట సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్‌కే మెహరున్నీసా, ఏఎన్ఎంలు, ఏఎస్‌హెచ్‌ఏలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదనందిపాడు మండలంలో..


తల్లులు, కిశోర బాలికలచే ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

పెదనందిపాడు (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాగులపాడు ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా బాలికలను రక్షిద్దాం, బాలికలను చదివిద్దాం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గుంటూరుకు చెందిన ఎన్.దుర్గాప్రసాద్, గోపీనాథ్‌ల కళాజాత బృందం వారు బాల్యవివాహాలపై ప్రదర్శన నిర్వహించారు. మగ, ఆడ అనే లింగ వివక్ష లేకుండా చదివించాలని, ఆడపిల్లకి 18 సంవత్సరాలు, మగపిల్లలకు 20సంవత్సరాలు నిండిన తరువాతే వివాహాలు చేయాలని తెలిపారు. అనంతరం తల్లులు, కిశోర బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వై రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీటీడబ్ల్యూవోగా నారాయణ

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారిగా (డీటీడబ్ల్యూవో) బందెల నారాయణ నియమితుడయ్యారు. డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న ఆయన గత కొన్ని నెలల నుంచి పోస్టింగ్ కోసం జీఏడీలో నిరీక్షిస్తున్నారు. ఎట్టకేలకు శనివారం ఆయనకు గుంటూరు జిల్లాలో పోస్టింగ్ కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

సివిల్ సప్లయిస్

విజిలెన్స్ డీసీగా రంగయ్య

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల జిల్లా శాఖ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్‌గా సీహెచ్ రంగయ్య నియమితుడయ్యారు. రెవెన్యూ శాఖకు చెందిన ఆయన్ని డిప్యూటేషన్‌పై సివిల్ సప్లయిస్ డిపార్టుమెంట్‌లో చేర్చుకొంటూ ఆ శాఖ ఎక్స్ అఫీషియో సెక్రెటరీ జీ వీరపాండియన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

తాడికొండను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్
● అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తాడికొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రానున్న నాలుగేళ్లలో తాడికొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కంతేరు, పొన్నెకల్లు గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన, మిని గోకులం షెడ్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధిని గాలికొదిలేశారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాజధాని, పోలవరం నిర్మాణంతో పాటు రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, సీనియర్ నాయకులు వాసిరెడ్డి జయరామయ్య, గుంటుపల్లి మధుసూదనరావు, కంచర్ల శివరామయ్య, యడ్లపల్లి సాంబశివరావు, బండ్ల కోటేశ్వరరావు, ఎంపీడీవో సమతావాణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కంతేరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

నియోజకవర్గంలో శనివారం పలు కార్యక్రమాలు ముగించుకొని విజయవాడ వెళ్తున్న క్రమంలో ఉండ వల్లి పోర్డ్ యార్డ్ దగ్గర ట్రక్ ఆటో బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న మహిళలు కిందపడి గాయపడ్డారు. అది గమనించిన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ కారు దిగి గాయపడిన మహిళలకు ధైర్యం చెప్పి హాస్పిటల్‌కు తరలించారు. మహిళలు వివరాలు అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండాలన్నారు.

ఓబన్న పోరాట పటిమ శ్లాఘనీయం

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన

మంగళగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే బ్రిటీషు ఈస్ట్ ఇండియా కంపెనీ వలస పాలకుల ఆగడాలకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన వడ్డే ఓబన్న పోరాట పటిమ శ్లాఘనీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. ఓబన్న జయంతిని పురస్కరించుకుని మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో నేతలు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కేసన శంకరరావు మాట్లాడుతూ ఉయ్యాల నరసింహారెడ్డి నాయకత్వంలోని 9 వేల మంది సైన్యానికి అధ్యక్షుడిగా ఓబన్న పని చేశారని, ఆనాడే బడుగు వర్గాలకు చెందిన వడ్డెర, బోయ, చెంచు యువతకు సైనిక శిక్షణ ఇచ్చి బ్రిటీషు వలస సైన్యాలపై తిరుగుబాటు చేశారని చెప్పారు. ఓబన్న జయంతిని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, నేతలు చింతా నాగరాజు, జీ.రవి, శ్రీనివాసులు, సాంబశివరావు, దానా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న శంకరరావు తదితరులు

శాఖా గ్రంథాలయంలో..

పెదనందిపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో వడ్డే ఓబన్న జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతూ తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించిన ధీరుడు, వడ్డెర ముద్దు బిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న అని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సుభాషిణి, ఎ.విజేంద్రరావు, మల్లిక, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

● తహసీల్దార్ నాసరయ్య

తాడికొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తాడికొండ మండల పరిధి గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాడికొండ తహసీల్దార్ కే.నాసరయ్య హెచ్చరించారు. కలెక్టర్ ఉత్తర్వులు, హైకోర్టు ఆదేశాల ప్రకారం కోడి పందేలు, జంతువులను బాధించటం, బెట్టింగులు జరపటం నిషేధించినట్లు తెలిపారు. ఈనెల 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు కోడి పందేలు, బెట్టింగులు నిర్వహించకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సహాయకులు, మహిళా పోలీసులతో టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

● పెదనందిపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎక్కడైనా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అద్దంకి మధుపవన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరైనా అనధికారికంగా బరులు వేసి కోడిపందేలు, పేకాట, అశ్లీల నృత్యాలు, డీజేలు వంటివి నిర్వహించినట్లైతే స్థానికులు వెంటనే పోలీసుల నెంబరు 9440900872కు సమాచారం ఇవ్వాలన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేటి నుంచి క్రికెట్ లీగ్ పోటీలు

మంగళగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం కానుంది. ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట మంగళగిరి మండలం నవులూరులోని అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఉదయం 8:30 గంటలకు ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని చిన్ని ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి నాటికల పోటీలు

ఫిరంగిపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొనుగుపాడు గ్రామంలో అభినయ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో 19వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు ఈనెల 12, 13, 14 తేదీల్లో జరగనున్నాయని సంస్థ వ్యవస్థాపకులు అభినయ శ్రీనివాస్ శనివారం తెలిపారు.

వంగిపురంలో మినీ గోకులాలు ప్రారంభం

ప్రత్తిపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వంగిపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రెండు మినీ గోకులం షెడ్‌లను ప్రత్తిపాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్ ప్రారంభించారు. ఒక షెడ్డు రూ.1.85 లక్షలు, మరో షెడ్డు రూ.2.35 లక్షలతో నిర్మాణం జరిగింది. ప్రభుత్వం పాడి గేదెల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో జీడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి, వెటర్నరీ ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ పాలేటి సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు జీవరత్తయ్య, ఇన్‌చార్జి ఏపీఏ ఏడుకొండలు, టీఏ రాజశేఖర్, పావన వెంకట శివయ్య, దండా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


వంగిపురంలో మిని గోకులంలను ప్రారంభిస్తున్న టీడీపీ మండల అధ్యక్షులు గింజుపల్లి శివరామప్రసాద్

వేములూరిపాడులో..


వేములూరిపాడులో మినీ గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వరరావు

ఫిరంగిపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములూరిపాడు గ్రామంలో గల కోడూరి సదాశివరావుకు చెందిన మినీ గోకులాన్ని ఎంపీడీవో వెంకటేశ్వరరావు ప్రారంభించారు. పల్లె పండుగ సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్ రూ.2.30 లక్షల నిధులతో నిర్మించిన పశువుల షెడ్డు ప్రారంభోత్సవంలో శనివారం టీడీపీ కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, పార్టీ ప్రధాన కార్యదర్శి కటికల రామకోటేశ్వరరావు, జెట్టి సుమన్, జహంగీర్, రఫీ, సయ్యద్ రబ్బానీ, పచ్చల రత్నరాజు, సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, ఏపీవో శ్రీనివాసరావు, ఎంపీటీసీ కే.అనురాధ, గోపీ, దుర్గ, కేకే తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

● ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

మంగళగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అన్ని రాజకీయ పార్టీలు చేనేత వర్గాలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధు లు కోరారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో ము ద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను మంగళగిరి ఆర్అర్ కన్వెన్షన్‌లో శనివారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ చేనేతలకు రాజకీయ ప్రాధాన్యం పెంపొందించుకునే విధంగా బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ సభకు సంబంధించి ఫిబ్రవరి రెండో తేదీన గన్నవరంలో రాష్ట్రంలోని చేనేత ప్రముఖులందరితో కలిసి సమావేశం నిర్వహించి, సభ లక్ష్యాలు, ఉద్దేశాలు ప్రకటిస్తామని చెప్పా రు. చేనేతలో ఉన్న 18 ఉపకులాలతో పాటు కార్మిక సంఘాలు, ఇతర సంఘాలను కలుపుకుని ఐక్యంగా ముందుకు నడ వాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఏపీఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి సమతం రమణ మహేష్, రాష్ట్ర అధ్యక్షుడు యెనుమల శివరాంప్రసాద్, పిల్లలమర్రి నాగేశ్వరరావు, బడిగంచుల విజయలక్ష్మి, అవ్వారు ముసలయ్య, పీ బాల యోగి, నక్కిన చినవెంకట రాయుడు, మునగాల మల్లేశ్వరరావు, రామనాథం పూర్ణ చంద్రరావు, కూరపాటి కోటే శ్వరరావు, జొన్నాదుల మణి, దామర్ల కుబేర స్వామి, ఆకురాతి రాజేష్ పాల్గొన్నారు.

17న విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలి

తాడేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న విజయవాడ ధర్నా చౌక్ అలంకార్ సెంటర్లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకర్ పిలుపునిచ్చారు. ఉండవల్లి సెంటర్ ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం జరిగిన రాజధాని రైతు సంఘం కమిటీ సమావేశంలో శివశంకర్ మాట్లాడుతూ టీడీపీ కూటమి ఎన్నికల సందర్భంగా రైతులకు పెట్టుబడి కింద రూ.20వేలు ఇస్తానని వాగ్దానం చేసిందని కానీ ఖరీఫ్ ముగిసి రబీ సగం పూర్తయినా ఇంతవరకు పెట్టుబడి కింద ఇస్తామన్న నగదు రైతుల ఖాతాలో జమ చేయలేదని చెప్పారు. తెనాలి డెల్టా ప్రాంతంలో కాలువల ఆధునికీకరణ పనులను వెంటనే చేపట్టాలని, పాడి రైతులకు బోనస్ ఇవ్వాలని, రాజధానిలో భూములిచ్చిన రైతులకు పెండింగ్ కౌలు నగదును వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. భూములు ఇచ్చిన రైతుల ప్లాట్లను వెంటనే అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గణేష్, కె.ఈశ్వర్‌రెడ్డి, టి.బక్కిరెడ్డి, వీరాస్వామి, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న జొన్నా శివశంకర్

39వ రోజుకు చేరుకున్న కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏసీసీ సిమెంటు కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు శనివారంతో 39వ రోజుకు చేరుకున్నాయి. ఈ రిలే దీక్షలను సీఐటీయూ నేత వేముల దుర్గారావు, యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఎన్ని మారినా ఏసీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి లోకేశ్ జోక్యం చేసుకుని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో నవనీతం, దానయ్య, ఆశీర్వాదం, ఆరిఫ్, హనుమంతరావు, గోపి కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో వేముల దుర్గారావు, బూరగ వెంకటేశ్వర్లు ఎం ఆశీర్వాదం, బి.అంకయ్య, గురవయ్య, శారద, సాంబయ్య, రమణ, కె.ఆదినారాయణ, పిచ్చయ్య, దుర్గాభవాని, శివకుమారి సూర్య ప్రకాష్, కృష్ణ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాన్ని ఉపసంహరించుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

పెదనందిపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం మోపిన విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో శనివారం సీపీఎం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీల్లో విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిందని, నేడు 16వేల కోట్ల విద్యుత్ భారాన్ని మోపారని దీనిని ఉపసంహరించి ప్రభుత్వమే భరాయించాలన్నారు. కరెంట్ బిల్లులను ఈనెల 13న భోగిమంటల్లో వేసి ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. గుంటూరు ఛానల్ పొడిగింపుపై ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ప్రాంతం నల్లమడ వరద ముంపునకు గురవుతుందని దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలని, తనిఖీల పేరుతో పింఛన్లు తొలగించరాదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, కొత్త వెంకటశివరావు, జంపని రామారావు, వెంకటసుబ్బారావు, దేవరకొండ శ్రీనివాసరావు, ముద్దన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాజీ డీజీపీని వేధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు(తూర్పు), జనవరి 11(ఆంధ్ర జ్యోతి): మాజీ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావును సరైన కారణం లేకుండా సస్పెండ్ చేసి, కోర్టు చెప్పినా కూడా పోస్టింగ్ ఇవ్వకుండా వేధించిన వైసీపీ ప్రభుత్వంపై, దీనికి సహకరించిన అధికారులపై విచారణ జరిపి కఠిన చర్యలను తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది జొన్నల గడ్డ దినకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దీనిపై ఈ నెల 9న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కలిసి ఫిర్యాదు చేశామని అన్నారు. విచారణ త్వరితగతిన చేస్తామని విజయానంద్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. దీనిపై ప్రభుత్వం కూడా కార్యాచరణ రూపొందిస్తుందని అన్నారు. ఏబీ వెంకటేశ్వరరావుకు తగు న్యాయం చేయాలని , ఆయన సేవలను ప్రభుత్వం వినియోగించుకోవాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత


ఈమనికి చెందిన తోట వెంకటరమణకు సీఎం సహాయనిధి నగదు చెక్కును అందిస్తున్న కూటమి నాయకులు

దుగ్గిరాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈమని గ్రామానికి చెందిన తోట వెంకటరమణకు సీఎం సహాయనిధి నగదు చెక్కును శనివారం అందించారు. కుటుంబాన్ని పోషించుకునేందుకు పని చేసే స్థితిలో లేక, కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రమణ సాయం కోరుతూ రాష్ట్ర విద్య, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన సీఎం సహాయనిధి నుంచి రూ.27,070 మంజూరు చేశారు. స్థానిక టీడీపీ నాయకులు కాబోతు దేవదాసు, కాసరనేని కృష్ణ, మన్నం అశోక్, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, తుమ్మపూడి చంటి పాల్గొన్నారు. సందర్భంగా లోకేశ్‌కు రమణ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు

దోస్త్ క్రికెట్ లీగ్ ఫైనల్ విజేత ఫ్రెండ్స్-11 జట్టు


దుగ్గిరాల దోస్త్ సేవాసంస్థ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్‌లీగ్ ఫైనల్‌లో విజయం సాధించిన దుగ్గిరాల ఫ్రెండ్స్-11 జట్టుతో నిర్వాహకులు

దుగ్గిరాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధిలో తనవంతు సహకారం అందిస్తున్న దోస్త్ స్వచ్ఛంద సేవా సంస్థ మండల స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన క్రికెట్ లీగ్ పోటీల్లో దుగ్గిరాల ఫ్రెండ్స్-11 జట్టు విజయం సాధించింది. నాలుగు రోజులుగా స్థానిక కేఎస్ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన పోటీల్లో 28 జట్లు పాల్గొన్నాయి. శనివారం జరిగిన ఫైనల్‌లో తుమ్మపూడి అన్‌స్టాపబుల్స్ జట్టుపై, దుగ్గిరాల ఫ్రెండ్స్ 11 జట్టు గెలుపొంది, విజేతగా నిలిచింది. దోస్త్ కమిటీకి చెందిన ఎన్నారై జంపాల సుబ్బారావు, గద్దె శ్రీనివాస్, గూడూరు వెంకట్రావు, వి.నరసింహారావు, జె.శివకృష్ణ, ఎస్ చిరంజీవి, పి.హర్షవర్ధన్, క్రీడాకారులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వినూత్నంగా సంక్రాంతి ముగ్గులు


దుగ్గిరాల పీహెచ్‌సీలో వినూత్నంగా రోగాలకు, వాటి నివారణను రంగవల్లుల రూపంలో తీర్చిదిద్దిన సిబ్బంది

దుగ్గిరాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గిరాల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు వివిధ రోగాలు, వ్యాధులకు తీసుకోవలసిన జాగ్రత్తలను కళ్లకు కట్టినట్లు తెలియజేస్తూ వినూత్నంగా రంగవల్లుల రూపంలో పీహెచ్‌సీ సిబ్బంది తీర్చిదిద్దారు. వైద్య వృత్తికి న్యాయం చేస్తూ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేస్తూనే ప్రజలకు అవగాహన కల్పించేలా రంగవల్లులు తీర్చిదిద్ది శభాష్ అనిపించారు. కనువిందుగా రంగవల్లులు వేసిన పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలను పీహెచ్‌సీ వైద్యులు ఇందిర, రహమాన్, జానమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వంకదార సుబ్బారావు, సూపర్‌వైజర్లు అభినందించారు.

నగరంలో తొలిసారిగా 100 విల్లాస్ నిర్మాణం

● సీతారామ్ టౌన్‌షిప్ అధినేత మామిడి సీతారామయ్య


ప్రాపర్టీ షోకు వచ్చిన మంత్రి నాదెండ్ల మనోహర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మామిడి సీతారామయ్య

గుంటూరు(తూర్పు), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో గేటెడ్ కమ్యూనిటీలో తొలిసారిగా పది ఎకరాల స్థలంలో 100 సూపర్ లగ్జరీ విల్లాస్ నిర్మిస్తున్నట్టు సీతారామ్ టౌన్ షిప్ అధినేత మామిడి సీతారామయ్య తెలిపారు. ఇదే ప్రాజెక్ట్‌లో మధ్య తరగతి ప్రజల కోసం 80 అపార్టుమెంట్లు కూడా నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. 20 ఏళ్ల అనుభవంతో ప్రతిష్టాత్మకంగా ఈ నిర్మాణాలు చేపట్టామని అన్నారు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను స్థానిక చేబ్రోలు హనుమయ్య కంపెనీ వద్ద ఏర్పాటు చేసిన నరెడ్కో ప్రాపర్టీ షోలో కంపెనీకి సంబంధించిన స్టాల్స్ వద్ద సంప్రదించాలని కోరారు. చదరపు గజం విలువ రూ.4 వేలు ఉందని, ఆదివారం లోపు ప్లాట్లు బుక్ చేసుకునే వారికి రూ 2,999కే అందజేస్తామని అన్నారు. నగర ప్రజలు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు హైదరాబాదు, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, సర్దార్ పటేల్‌నగర్, రోడ్ నెం.17, ప్లాట్ నెం.61 కాపురస్తులు 1) నాయుడు జయలక్ష్మీ గారి కుమారుడు నాయుడు అనిల్ కుమార్ మరియు గుంటూరుజిల్లా, పెదకాకాని (మం), ఉప్పలపాడు గ్రామ కాపురస్తులు 2) ముప్పాళ్ళ సీతారామయ్య గారి కుమారుడు ముప్పాళ్ల సాంబశివరావు గార్ల నుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది. ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని హైదరాబాద్ సిటీ, జమీర్‌పేట, దివ్యశక్తి అపార్టుమెంట్స్ ఫ్లాట్ నెం. 3సి కాపురస్తులు 1) కట్టా కృష్ణమూర్తి గారి కుమారుడు కట్టా అనిల్‌కుమార్ గారు, హైదరాబాద్ సిటీ, సనత్‌నగర్, డోర్.నెం.7-2-166రు కాపురస్తులు 2) పావులూరు రవీంద్రనాధ్ గారి భార్య పావులూరు అజిత గార్లు వారియొక్క స్వార్జితపు ద్రవ్యముతో గుంటూరు సిటీ, చంద్రమౌళినగర్, డోరు నెం.5-90-3రు కాపురస్తులు కోలా రంగారావు గారి భార్య కోలా సీతారావమ్మ గారి నుండి 7087/2019 నంబరుగల విక్రయ దస్తావేజు ద్వారా 1) కట్టా అనిల్ కుమార్, 2) పావులూరు అజిత గార్లు కొనుగోలుచేసి, వారి స్వాధీన హక్కు భుక్తములతో అనుభవిస్తున్న ఆస్తిని వారు విక్రయించదలచి,బహిరంగపరచి దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి నిష్పేచి ఆస్తి అని, దిగువ షెడ్యూలు ఆస్తిపైన ఏవిధమైన తనఖాలు, ఋణములు, హామీలు, కోర్టు వారి యొక్క జప్తులు లేవని, ఏవిధమైన దావాలు లేవని మా క్లయింట్లకు సదరు 1) కట్టా అనిల్ కుమార్, 2) పావులూరు అజిత గార్లు తెలిపియున్నారు. మా క్లయింట్లు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనుగోలు చేయుటకు సంసిద్ధులై, 1) కట్టా అనిల్‌కుమార్, 2) పావులూరు అజిత గార్లతో విక్రయ ఖరాఫుపడియున్నారు. ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన తనాఖాలు, ఋణములు, కోర్టు జప్తులు, దావాలు ఉన్నయెడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజులలోగా మాకు గాని, మా క్లయింట్లకు గాని లిఖితపూర్వకముగా తెలియజేయగలరు. గడువు తేది లోగా ఎవరి నుండి ఏవిధమైన అభ్యంతరములు, క్లెయిములు, ఆక్షేపణలు రాని ఎడల దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి నిష్పేచి ఆస్తిగా భావించి మా క్లయింట్లు సదరు 1) కట్టా అనిల్‌కుమార్, 2) పావులూరు అజిత గార్లకి పూర్తి ప్రతిఫలము చెల్లించి విక్రయ దస్తావేజు వ్రాయించు కొనగలరు. గడువు తేది తదుపరి వచ్చిన అభ్యంతరములు పరిగణలోనికి తీసుకొనబడవు.

షెడ్యూలు: గుంటూరు డి॥, నల్లపాడు సబ్.డి॥ యిలాకా గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరి టౌన్ సర్వే కానటువంటి నల్లపాడు గ్రామము తాలూకు డి.నెం.255,256ర్లు సబ్-డివిజన్ దాఖలా నల్లపాడు గ్రామము తాలూకు డి.నెం.255/2రు దాఖలా నెం.24,25ర్లు ప్లాట్లు చ.గ.750లు స్థలమున్నూ, యిందులోని డోరు నెం. 2-16-110, 2-16-111ర్లు, కొత్త అసిస్మెంటు నెం.1021007681, 1021007682ర్లు గల రెండు ఎ.సి.సి రేకుల షెడ్లు యావద్విశిష్టములతో సహాకు హద్దులు:తూర్పు:జి.భారతి మరియు జి. సత్యవతి గార్ల ఆస్తిహద్దు, అ.75లు,దక్షిణం:అ.30లు వెడల్పు గల మునిసిపల్ కార్పోరేషన్ రోడ్డు హద్దు,అ.90లు,పడమర: ఎం.రంగారెడ్డి గారి ఆస్తి హద్దు,అ.75లు,ఉత్తరం:ఐ.నాగేశ్వరరావు వగైరాల ఆస్తి హద్దు, అ.90లు.

పి.శ్రీనివాస చక్రవర్తి, B.Com., B.L.,
జె. చంద్రశేఖర్,M.B.A., B.L.,న్యాయవాదులు, ఫ్లాట్ నెం.401, గోకుల్ ఎలైట్ అపార్టుమెంట్, శ్రీనగర్ 4వ లైను, గుంటూరు, సెల్: 9440308999

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

సివిల్ సప్లయిస్ విజిలెన్స్ డీసీగా రంగయ్య

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల జిల్లా శాఖ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్‌గా సీహెచ్ రంగయ్య నియమితు డయ్యారు. రెవెన్యూ శాఖకు చెందిన ఆయన్ని డిప్యూటేషన్‌పై సివిల్ సప్లయిస్ డిపార్టుమెంట్‌లో చేర్చుకొంటూ ఆ శాఖ ఎక్స్ అఫీ షియో సెక్రెటరీ జీ వీరపాండియన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

కోడి పందేలకు అనుమతులు లేవు

తెనాలి రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను ఆహ్లాదకర వాతావర ణంలో జరుపుకోవాలని తహసీల్దార్ గోపాల కృష్ణ చెప్పారు. శనివారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పేరుతో కోడి పందేలు, జూద క్రీడలు వంటివి ఆడేందుకు అనుమతులు లేవన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉంటారన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేకంగా పండుగ పేరుతో కోడిపందేలు, జూదం ఇతర చర్యలకు పాల్పడితే ఊపేక్షించేదే లేదన్నారు. ప్రతి గ్రామంలో నిఘా ఏర్పాటు చేశామని నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ కుటుంబంతో పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

కోడిపందేలు అరికట్టేందుకు సంయుక్త తనిఖీ బృందాలు

గుంటూరు సిటీ, జన వరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కోడి పందేలు అరికట్టేందుకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు ప్రత్యేక సంయుక్త తనిఖీ బృందాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ఓ నరసింహారావు వెల్లడిం చారు. ఈ మేరకు శని వారం జిల్లాలోని మునిసి పల్ కమిషనర్లు, తహసీల్దార్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, పశు సంవర్ధక శాఖ అధి కారులు, పశు వైద్యులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేల పేరిట కోళ్ళను హింసించడం, జంతువుల పట్ల హింస పాల్పడటం శిక్షార్హమైన నేరమని అన్నారు. కోడిపందేలు నిర్వహించుట జంతు హింస నివారణ చట్టం 1960, ఆంధ్రప్రదేశ్ గేమింగ్ చట్టం 1974 ప్రకారం శిక్షార్హమని, వాటిని అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులతో సంయుక్త తనిఖీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీ ఈ నెల 11వ తేదీ నుంచి 17 వరకు గ్రామాల్లో పర్యటించి తనిఖీలు నిర్వహిస్తారని అన్నారు. ఈ సందర్భంగా కోడిపందేల నివారణకు రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

డీటీడబ్ల్యూవోగా నారాయణ

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమ శాఖా ధికారిగా (డీటీడబ్ల్యూవో) బండెల నారాయణ నియమితుడయ్యారు. డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న ఆయన గత కొన్ని నెలల నుంచి పోస్టింగ్ కోసం జీఏడీలో నిరీక్షిస్తున్నారు. ఎట్టకేలకు శనివారం ఆయనకు గుంటూరు జిల్లాలో పోస్టింగ్ కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

వేధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు(తూర్పు), జనవరి 11(ఆంధ్ర జ్యోతి): మాజీ డీజీపీ ఏబి వేంకటేశ్వరరావును సరైన కారణం లేకుండా సస్పెండ్ చేసి, కోర్టు చెప్పినా కూడా పోస్టింగ్ ఇవ్వకుండా వేధించిన వైసీపీ ప్రభుత్వంపై, దీనికి సహకరించిన అధి కారులపై విచారణ జరిపి కఠిన చర్యలను తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది జొన్నల గడ్డ దివాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దీనిపై ఈ నెల 9న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కలిసి ఫిర్యాదు చేశామని అన్నారు. విచారణ త్వరితగతిన చేస్తామని విజయానంద్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. దీనిపై ప్రభుత్వం కూడా కార్య చరణ రూపొందిస్తుందని అన్నారు. ఏబీ వెంకటేశ్వరరావుకు తగు న్యాయం చేయాలని , ఆయన సేవలను ప్రభుత్వం వినియోగించుకోవాలని కోరారు.

విజ్ఞాన్ వర్సిటీలో సంక్రాంతి సంబరాలు

గుంటూరు(విద్య),జనవరి 11(ఆంధ్ర జ్యోతి): సంక్రాంతి విశిష్టతను తెలిపే రంగు రంగుల రంగవల్లులు, హరిదాసు సంకీర్తనలు, కోలాటాలతో తెలుగు సంప్ర దాయాలు ఉట్టిపడేలా చేబ్రోలు మండ లం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూని వర్సిటీలో శనివారం సంక్రాంతి సంబ రాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా హాజరైన విద్యా సం స్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే రైతుల పండుగ అని, పండుగ లోని విశిష్టతను, శాస్త్రీ యతను విద్యార్థులు గుర్తించాలని సూచించారు. తమ విద్యా సంస్థల్లో ఏటా అన్ని పండుగలను వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీ అని తెలిపారు. పిల్లలకు సంస్కృతీ సంప్రదాయాలపై గౌరవం పెంచాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.



చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

పట్టణాలకు దీటుగా గ్రామాలను తీర్చిదిద్దుతాం

● రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్
● సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన
● గ్రామస్థుల నుంచి వినతుల స్వీకరణ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్, సమస్యలను మంత్రికి వివరిస్తున్న గ్రామస్థులు

తెనాలి రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణాలకు దీటుగా ప్రతి గ్రామాన్ని తీర్చిదిద్దాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణలు పనిచేస్తున్నారని, రాబోయే రోజుల్లో అన్ని మౌలిక వసతుల కల్పనతో గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శనివారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొలకలూరు, నందివెలుగు గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. కొలకలూరు గ్రామంలో హిందూశ్మశానవాటికకు వెళ్లేందుకు రోడ్డు అధ్వానంగా ఉండటంతో అంతిమసంస్కారాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు గతంలో మంత్రికి వివరించారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి ఆ మార్గానికి ఉపాధి నిధులతో రోడ్డు వేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు రూ. 13 లక్షలతో ఆయా పనులు ప్రారంభించేందుకు ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని మంత్రి మనోహర్ ఆవిష్కరించారు. అలాగే మండలంలోని నందివెలుగులో రావి అమ్మయ్య కాలనీలో రూ.20లక్షలతో నిర్మించనున్న అప్రోచ్ రోడ్డు, అంతర్గత రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. త్వరితగతిన రోడ్డు పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమినేతలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థుల యోగక్షేమాలను విచారించిన మంత్రి

మండలంలోని కొలకలూరు,నందివెలుగు గ్రామాల్లో పర్యటించిన మంత్రి ఆయా గ్రామస్థుల యోగక్షేమాలను విచారించారు. పలువురు మంత్రి మనోహర్‌కు పింఛన్, రేషన్ కార్డులు వంటి సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలను వేగంగా పరిష్కరించి మంచి జరిగేలా చూస్తానని వారికి హామి ఇచ్చారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి చేయూత

చేబ్రోలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేయూతనందిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు అన్నారు. మండల పరిధిలోని వేజెండ్ల, శుద్ధపల్లి, శేకూరు గ్రామాల్లో శనివారం పల్లె పండగ వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించిన 28 మినీ గోకులం షెడ్లను అధికారులతో కలిసి కూటమి పార్టీల నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేవలం 10 శాతం లబ్ధిదారుల వాటాతో పశువుల చావిడలను ప్రభుత్వమే నిర్మిస్తుందన్నారు. దీని ద్వారా రైతులకు మేలు జరుగుతుందని, పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొప్పాక లలిత, జనసేన మండల అధ్యక్షుడు చందు శ్రీరాములు, వీరంకి రంగారావు, రైతులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మినీ గోకులం షెడ్లు ప్రారంభిస్తున్న కూటమి నేతలు

యువత ముందంజలో ఉండాలి

● ఏపీ రైతు సంఘం నేత శివసాంబిరెడ్డి

కొల్లిపర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూములూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. యువతీ, యువకులు, విద్యార్థులు సంక్రాంతి సంబరాల్లో పాల్గొని రంగవల్లులు, హరిదాసు, ముగ్గుల్లో గొబ్బిమ్మలు, భోగి మంటలు వేయడంతో సంక్రాంతి విశిష్టతను చాటుకుంది. ఈసందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి మాట్లాడుతూ యువతీ, యువకులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ఎన్. భావన్నారాయణ మాట్లాడుతూ యువతీ, యువకులకు క్రీడలు ఎంతగానో అవసరమన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన 60మందికి రైతు సంఘం నేతలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కెదార్నాథ్, అంగన్‌వాడీ యూనియన్ కమిటీ సభ్యురాలు స్వర్ణలత, ఉపాధ్యాయుడు నరసింహారావు పాల్గొన్నారు.

పొలాల్లో మోటారు చోరీ

పొన్నూరుటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలోని పంట పొలాల్లో విద్యుత్ మోటారు చోరీకి గురైంది. గత కొద్ది రోజులుగా చింతలపూడి పరిసర ప్రాంతాల్లో కాపర్ వైర్ల కోసం దొంగలు వరుసగా చోరీలకు పాల్పడుతున్నారు. ఇప్పటి వరకు వైర్లు మాత్రమే చోరీ చేసిన దొంగలు, తాజాగా గ్రామానికి చెందిన ఎస్.నాగేశ్వరరావుకు చెందిన పంట పొలంలోని విద్యుత్ మోటార్‌ను దొంగలించారు. వరుస చోరీలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కాపర్ వైర్ కోసం వేలాది రూపాయల విలువ కలిగిన మోటార్లు చోరీ జరుగుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పోలీస్ అధికారులు స్పందించి వరుస చోరీలకు అడ్డుకట్ట వేయాలని వేడుకుంటున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కొల్లిపర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ యువసేన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు భీమవరపు ఎన్టీఆర్ కోటిరెడ్డి, ఎన్టీఆర్ యువసేన జిల్లా అధ్యక్షుడు మర్రెడ్డి సుధాకర్‌రెడ్డి, యువసేన కమిటీ సభ్యులు ఆరిమండ ప్రకాశరెడ్డి, టీడీపీ నాయకులు ఆళ్ల వీరారెడ్డి, అద్దంకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి 108 గంగాళాలతో కుడార్రై ఉత్సవాలు



అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్న బాలస్వామి

తెనాలి, మారీసుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంగానమ్మపేటలోని విద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) ప్రత్యక్ష పర్యవేక్షణలో శనివారం ధనుర్మాసంలో 27వ రోజు గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను వివిధ రకాల పుష్పాల అలంకరణతో పూజలు నిర్వహించి 108 గంగాళాలతో కుడార్రై ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేకంగా 108 గంగాళాలలో పాయస అన్నంచేసి అమ్మవారికి నివేదన చేశారు. ఈ సందర్భంగా బాలస్వామి ప్రవచనం చేస్తూ అమ్మవారు ధనుర్మాసంలో 26 రోజులు నెయ్యి అన్నం, పాలన్నం ఏమీ నైవేద్యంగా స్వీకరించరని తెలిపారు. 27వరోజు నుంచి అమ్మవారికి ప్రత్యేకంగా పాయసాన్నం చేసి నివేదన చేస్తామని తెలిపారు. తిరుప్పావై పాశురాలను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈనెల 13న గోదా రంగనాథుల కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, లోకనాథం, రామకృష్ణ, సుమంత్, శ్రీజయలక్ష్మీ మాతృమండలి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జనసైనికుడి మృతి బాధాకరం

● పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్
● కుటుంబ సభ్యులకు రూ.5 లక్షలు చెక్కు అందజేత

తెనాలి రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలకుదురుకు చెందిన జనసైనికుడు పెండ్యాల వెంకటేశ్వరరావు మృతి బాధాకరమని మంత్రి మనోహర్ అన్నారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో వెంకటేశ్వరరావు మృతి చెందగా, కుటుంబ సభ్యులను శనివారం మంత్రి మనోహర్ జనసేన నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించారు. పార్టీ సభ్యత్వ బీమా కింద రూ.5 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు మనోహర్ అందించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తొలుత మృతుడు వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ కోసం ఆయన చేసిన సేవలను మననం చేసుకున్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృపాచారి తదితరులు

స్వప్నవేణువు పుస్తకావిష్కరణ

తెనాలి అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కవిరాజా పార్కులో శనివారం రచయిత కె.దేవికారాణి రచించిన స్వప్నవేణువు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దళిత విశ్వ విద్యాలయం ఉపకులపతి గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ, సమాజాన్ని తట్టి లేపేందుకు రచనలు దోహదపడతాయన్నారు. యాంత్రిక జీవనం గడుపుతున్న వారికి పుస్తకాలు సాంత్వన చేకూరుస్తాయని చెప్పారు. బహుజన రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి తంగిరాల సోని గ్రంథ సమీక్ష చేశారు. రచయితలు అస్మతున్నీసా, భాగ్యలక్ష్మి, ఆకాష్, బ్యాంకు మేనేజర్ యశ్వంత్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు భోగి పండుగను నిర్వహించిన టీడీపీ కౌన్సిలర్ అరుణ తదితరులు

అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు భోగి వేడుకలు


తెనాలి, మారీసుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాండురంగ పేటలోని 27వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు భోగి వేడుకలను చిన్నారుల కేరింతల నడుమ అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ కౌన్సిలర్ బి. అరుణ పాల్గొని చిన్నారులపై భోగిపళ్లను పోసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భోగి పండగ అనేది తెలుగువారు జరుపుకునే ఒక ముఖ్యమైన పండగ అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

నేడు తెనాలిలో సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ

తెనాలి అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నారు. తెనాలి వీఎస్ఆర్ కళాశాల వద్ద ఉన్న తెనాలి బండ్‌పై కృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కృష్ణ సోదరుడు ఆదిశేషగిరిరావు పాల్గొంటారని ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

నియోజకవర్గ స్థాయిలో ముగ్గుల పోటీలు

తెనాలిఅర్బన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు, మహిళలను ప్రోత్సహించేందుకు నియోజకవర్గ స్థాయిలో ముగ్గుల పోటీలను ఏర్పాటు చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రామలింగేశ్వర పేటలో జనసేన వీరమహిళల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను శనివారం ఆయన పరిశీలించారు. 40మంది మహిళలు వేసిన ముగ్గులను చూసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగు వారి కుటుంబాలలో ఆనందం, సంతోషం నింపుతుందన్నారు. దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా జన్మభూమికి చేరే అరుదైన పండుగ సంక్రాంతి అని చెప్పారు. పార్టీ నాయకులు గాదె వెంకటేశ్వరరావు, శ్రీకాంత్, సుబ్రహ్మణ్యం, గోపాలకృష్ణ, కౌన్సిలర్ మానసరెడ్డి, హరిదాసు గౌరీ తదితరులు పాల్గొన్నారు.



జనసేన మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి

● చిత్ర పటానికి నివాళులర్పించిన బీసీ సంఘ నేతలు

తెనాలి, మారీసుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంగానమ్మపేటలోని బీసీ సంఘ కార్యాలయంలో శనివారం ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న 218వ జయంతి వేడుకలను బీసీ సంక్షేమ సంఘం, వడ్డెర సంక్షేమ సంఘ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ సంఘ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్, వడ్డెర సంక్షేమ సంఘ రాష్ట్ర నాయకుడు వేమూరి కృష్ణ పాల్గొని సంఘ సభ్యులతో కలసి వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ స్వాతంత్ర సంగ్రామానికి ముందే బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఉయ్యాల నరసింహారెడ్డితో కలసి ఓబన్న వీరోచితంగా పోరాడారన్నారు. ఆయన చేసిన త్యాగాలను మరువరాదన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ యువజన కార్యదర్శి కొల్లూరు హనుమంతరావు, వేముల మధు, వేములు, శ్రీను, కనకరాజు, చిన్నోడు, సాయిరాం పాల్గొన్నారు.



ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు తదితరులు



ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబును కలిసిన స్థానిక బీజేపీ నేతలు

ఒడిశా గవర్నర్‌కు ఘన స్వాగతం

పొన్నూరుటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబుకు శనివారం పొన్నూరులో ఘనస్వాగతం లభించింది. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన నిడుబ్రోలు విచ్చేశారు. పట్టణానికి విచ్చేసిన గవర్నర్ హరిబాబుకు తహసీల్దార్ జియావుల్ హక్, రెవెన్యూ అధికారులు ఘన స్వాగతం పలికారు. స్థానిక బీజేపీ నాయకులు గవర్నర్ హరిబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, బీజేపీ రాష్ట్ర నాయకులు జమ్ముల శ్యామ్ కిషోర్, యడ్లపాటి రఘునాథ్ బాబు, యడ్లపాటి స్వరూప వాణి, ఆర్.లక్ష్మీపతి, స్థానిక బీజేపీ నాయకులు గోవాడ చలపతిరావు, చెరుకూరి తిరుపతిరావు, గోవాడ వెంకటకృష్ణరావు, సుబ్బరావు, గోగినేని వెంకటేశ్వరరావు, దాసరి వెంకయ్య, ఆరె వెంకట్రావు, భట్టిప్రోలు రామకృష్ణ, పరాశరం రంగవల్లి, గురుబాలు, తన్నీరు శివరామకృష్ణ, ఎస్.సురేష్ తదితరులు గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.



కుడార్రై ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

కోదండ రామాలయంలో కుడార్రై ఉత్సవం

పొన్నూరుటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని తెలగపాలెం కోదండ రామాలయంలో కుడార్రై ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువుదీరిన సీతా లక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాయస గంగాళాలతో గోదా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవంలో పాల్గొన్న మహిళలు రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్ది దీపోత్సవం నిర్వహించారు. అనంతరం తిరుప్పావై పఠించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు చిలకపాటి లక్ష్మణ రామాచార్యులు, దేవరాజస్వామి ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి మనోహర్, మాజీ మంత్రి ఆలపాటికి వినతపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

విగ్రహ పనులకు అనుమతులివ్వండి

● మంత్రి మనోహర్, మాజీ మంత్రి ఆలపాటికి కమిటీ సభ్యుల వినతి

తెనాలి రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తెనాలి ఐతానగర్‌లోని నెహ్రూ రోడ్డు- ప్రకాశం రోడ్డు జంక్షన్‌లో భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులకు అడ్డంకులను తొలగించి కొనసాగించేలా అనుమతులిప్పించాలని మంత్రిమనోహర్‌ను నిర్వాహక కమిటీ సభ్యులు కోరారు. శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో మంత్రిని కలిసిన వారు గతంలో న్యాయస్థానం ద్వారా విగ్రహానికి అన్ని అనుమతులు మంజూరు అయినా మునిసిపల్, పోలీస్ శాఖల అధికారులు నిర్మాణపనులునిలిపివేసి విగ్రహాన్ని తొలగించాలంటూ కమిటీకి సూచనలు చేస్తున్నారని వివరించారు. విగ్రహ ఏర్పాట్ల పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఇదే విషయంపై మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను, వేమూరు ఎమ్మెల్యే నక్కాఆనంద్‌బాబును తెనాలిలో కలిసి వినతిపత్రం అందించారు. కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా పుష్పయాగం

పొన్నూరుటౌన్, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలోని రుక్మిణి, సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం స్వామి వారి పుష్పయాగం శోభాయమానంగా జరిగింది. స్వామివారి పుష్ప యాగం సందర్భంగా వేకువజామున ఆలయంలో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వివిధ రకాల పుష్ప జాతులతో స్వామి వారికి పుష్పయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో చింతలపూడి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో కొలువుదీరిన రాజ్యలక్ష్మి అమ్మవారి క్షేత్ర పాలకుడైన వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.



వేణుగోపాల స్వామికి పుష్పాభిషేకం

చేనేతలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

● ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

మంగళగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అన్ని రాజకీయ పార్టీలు చేనేత వర్గాలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించాలని ఆలిం డియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధు లు కోరారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో ము ద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను మంగళగిరి ఆర్ఆర్ కన్వెన్షన్‌లో శనివారం ఆవిష్కరించా రు. అనంతరం జరిగిన రౌండ్ టేబుల్ సమా వేశంలో ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బం డారు ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ చేనేత లకు రాజకీయ ప్రాధాన్యం పెంపొందించుకు నే విధంగా బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ సభకు సం బంధించి ఫిబ్రవరి రెండో తేదీన గన్నవ రంలో రాష్ట్రంలోని చేనేత ప్రముఖులంద రితో కలిసి సమావేశం నిర్వహించి, సభ లక్ష్యాలు, ఉద్దేశాలు ప్రకటిస్తామని చెప్పా రు. చేనేతలో ఉన్న 18 ఉపకులాలతో పా టు కార్మిక సంఘాలు, ఇతర సంఘాల ను కలుపుకుని ఐక్యంగా ముందుకు నడ వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ మురుగుడు హను మంతరావు, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస రావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి సమతం రమణ మహేష్, రాష్ట్ర అధ్యక్షుడు యెనుమ ల శివరాం ప్రసాద్, పిల్లలమర్రి నాగేశ్వర రావు, బడిగించల విజయలక్ష్మి, అవ్వారు మునలయ్య, పీ బాలయోగి, నక్కిన చినవెం కట రాయుడు, మునగాల మల్లేశ్వరరావు, రామనాథం పూర్ణచంద్రరావు, కూరపాటి కోటే శ్వరరావు, జొన్నాదుల మణి, దామర్ల కుబేర స్వామి, ఆకురాతి రాజేష్ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు